ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 28.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 248 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

వుమెన్ ప్రీమియర్ లీగ్..కోట్లు కొల్లగొట్టిన అమ్మాయిలు 12

బీసీ కోటా కోసం గళమెత్తండి

సమష్టిగా ప్రధానికి కలవండి

సభలో సమగ్ర చర్చ జరిగేలా చూడండి

- తొమ్మిదో షెడ్యూలు సవరణ జరిగి తీరాలి
- రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి
- తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలి
- అవసరం అయితే సీఎం ఆధ్వర్యంలో ఢిల్లీకి వస్తాం
- కేంద్రం నుంచి భారీ ఎత్తున నిధులు సాధించాలి
- పెండింగ్ ప్రాజెక్టుల సమస్యలు పరిష్కారం కావాలి
- ఎంపీల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 27: బీసీలకు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తొమ్మిదవ షెడ్యూలులో సవరణ జరగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటు సమావేశాలలో ప్రత్యేకంగా చర్చకు తీసుకువచ్చి బీసీలకు మేలు చేయాలని విన్నవించారు. నిర్దేశిత ఫార్మేట్ లోనే సభలో చర్చకు తేవాలని సూచించారు. గురువారం ఆయన ప్రజాభవన్ లో రాష్ట్రానికి చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రికి రాష్ట్రానికి చెందిన అందరు ఎంపీలు ఒక వినతిపత్రం ఇవ్వాలన్నారు. ప్రధాని సమయం ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్న విషయాన్ని వివరించాలన్నారు. ముఖ్యంగా బీసీల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందన్నారు. ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడితే పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు. బిల్లు గవర్నర్ నుంచి కేంద్రం వద్దకు వెళ్లి పెండింగులో ఉందన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం

రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా పార్లమెంట్ సభ్యులందరూ పార్టీలకు అతీతంగా ఒక బృందంగా

..:: మిగతా 2లో

రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ ఐదు లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది.

..:: 3లో

జల్సాలు, ఆస్తుల సంపాదన లక్ష్యంగా కొందరు పోలీసులు తప్పడు పద్ధతులలో వెళ్తున్నారు. బెట్టింగ్‌కు అలవాటైన అంబర్‌పేట్ ఎస్ఐ భానుప్రకాశ్‌రెడ్డి తాను రికవరీ చేసిన బంగారం, సర్వీస్ రివాల్వర్ తాకట్టు పెట్టాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించినా పొంతనలేని సమాధానాలు చెప్పినట్టు సమాచారం. సైబరాబాద్‌కమిషనరేట్‌పరిధి పోలీస్ స్టేషన్లలోనూ అక్రమార్జన జోరుగా సాగుతోంది. భూముల విలువలు భారీగా పెరగడంతో ప్రైవేట్ కేసులలో తలదూర్చి కొందరు సీఐలు, ఏసీపీలు అక్రమార్జన చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి నోటీసులు లేకుండా పోలీస్ స్టేషన్ కు పిలిచి బెదిరింపులకు గురి చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి.

డబ్బుకు దాసోహం పోలీస్!!

కొందరి తీరుతో శాఖకు చెడ్డ పేరు..

జవాన్ నుంచి సీఐ దాకా విలువల తాకట్టు

- నెల రోజుల వ్యవధిలోనే నలుగురిపై వేటు
- డబ్బు సంపాదనే లక్ష్యంగా తప్పడు పద్ధతులు
- ఉన్నతాధికారులు కట్టడి చేసినా మారని దుస్థితి
- 80 శాతం దాకా ఇలాగే ఉన్నారన్న విమర్శలు
- ఏసీబీ దాడులలోనూ భారీగా చిక్కుతున్న వైనం
- సివిల్ కేసులలోనూ ఠాణాలకు పిలిపించి బెదిరింపులు
- లక్షల రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి
- యథేచ్ఛగా సాగుతున్న అవినీతి, అక్రమాలు
- ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలంటున్న జనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 27: ఖాకీ యూనిఫాం అంటే ఎంతో గౌరవం, ప్రతిష్ట ఇది ఒకప్పటి మాట. నేడు యూనిఫాంను అడ్డం పెట్టుకొని అక్రమార్జనే ధ్యేయంగా కొంత మంది పని చేస్తున్నారు. పోలీసు శాఖలో దాదాపు 80శాతం మంది విలువలను తాకట్టు పెట్టి అక్రమంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా కొలువులు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏదో సమస్యపై, లేక భూ వివాదాలు ఇలాంటి గురించి న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కే సామాన్యుడిని జలగల్లా పీడిస్తున్నట్లు బలమైన ఆరోపణలున్నాయి. ఇటీవల కాలంలో ఏసీబీ దాడులలో పోలీసు శాఖలో పని చేస్తున్న సిబ్బంది ఎక్కువగా చిక్కుతున్నారు. ఉద్యోగంలో చేరాక 'మన ఒంటి మీద ఖాకీ యూనిఫాం ఉంది కదా!' అని కొంత మంది విర్రవీగుతూ ఉంటారు. మరికొందరు 'నేను పోలీసును కదా! ఏం చేసినా చెల్లుతుందని' అక్రమాలకు

..:: మిగతా 2లో

చైనా, జపాన్‌లా అభివృద్ధి చెందాలి

- ప్రపంచంతో పోటీ పడేలా స్కిల్డ్ యూత్
- కొత్త రంగాలలో కొంగొత్త మార్గాల అన్వేషణ
- తెలంగాణ వృద్ధి ప్రతిబింబించేలా రైజింగ్-పాలసీ
- మూడు రీజియన్లుగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 27: తెలంగాణ అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2034 నాటికి వన్ ట్రిలియన్, 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్ లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా

..:: మిగతా 2లో

'ట్యాపింగ్' కేసులో కీలక పరిణామం

కేసీఆర్ ఓఎస్డీని విచారించిన సిట్

- రాధాకిషన్ రిమాండ్ రిపోర్టు ఆధారంగా
- రెండు గంటలు ప్రశ్నించిన అధికారులు
- సీఎంఓ పనితీరు, నియామకాలపైనా ఆరా
- బీఆర్ఎస్ వర్గాలలో కలకలం రేపిన విచారణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 27: కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ మళ్లీ విచారణ ప్రారంభించింది. మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీగా ఉన్న రాజశేఖర్ రెడ్డిని గురువారం విచారించింది. ఆయనను రెండు గంటలపాటు ప్రశ్నించిన పోలీసులు ఆయన జవాబులను రికార్డ్ చేశారు. నిరుడు మార్చిలో టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. బీఆర్ఎస్ సుప్రీమ్ తో పాటు ఆ పార్టీ కీలక నేతలతో తరచూ సంప్రదింపులు జరిపామని రాధాకిషన్ రావు కన్ఫెషన్ స్టేట్‌మెంట్ లో పోలీసులకు తెలిపారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు నియామకం, నోట్ ఫైల్, జీఓకు సంబంధించి రాజశేఖర్ రెడ్డిని విచారణాధికారులు వెంకటగిరి, జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ ప్రశ్నించినట్లుగా సమాచారం. సీఎంఓలో ప్రొసీజర్ ఎలా ఉంటుందనే దానిపై కూడా ప్రశ్నించినట్లుగా

..:: మిగతా 2లో

2019 గ్రూప్-2 ర్యాంకర్లకు భారీ ఊరట

- సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు సస్పెన్షన్
- ర్యాంకర్లకు డివిజన్ బెంచ్ తాత్కాలిక రక్షణ
- తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా
- వాదనలు సమగ్రంగా వినాలని నిర్ణయం

..:: 2లో



రాజ్యాంగ సవరణకు ప్రధాని సహకరించాలి

- బీసీలకు 42 శాతం కోటా వచ్చేలా చూడాలి
- మోడీ కృషితోనే దేశవ్యాప్తంగా కులగణన
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- కోటా కోసం ఢిల్లీ కేంద్రంగా ఉద్యమిస్తాం
- ప్రజా ఐక్య కూటమి చైర్మన్ దాసు సురేశ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 27: రాజ్యాంగ సవరణకు ప్రధాని సహకరించాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కోరారు. 1931 తరువాత స్వతంత్ర భారతంలో కులగరణ చేస్తున్న ఘనత ప్రధాని మోడీకే

..:: మిగతా 2లో

జెన్ జెడ్ టాలెంట్ ఓ బెంచ్ మార్క్

భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని అన్నారు.

11



'కోర్టు మాత్రం ఏం మ్యాజిక్ చేయగలదు?!

దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు దిగజారిపోతున్నది. ఈ క్రమంలో ఢిల్లీలో కాలుష్య కట్టడి కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు డిసెంబర్ మూడున విచారించనున్నట్లు తెలిపింది.

11

షేక్ హసీనాకు 21 సంవత్సరాల జైలుశిక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బిగ్ షాక్ తగిలింది. మూడు అవినీతి కేసులలో ఆమెకు బంగ్లాదేశ్ కోర్టు 21 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు స్థానిక మీడియా గురువారం వెల్లడించింది.

11

వైట్ హౌస్ దగ్గర కాల్పుల కలకలం

అమెరికా రాజధాని వాషింగ్టన్ వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్‌కు చెందిన ఇద్దరు సభ్యులపై బుధవారం వైట్ హౌస్‌కు కొద్ది దూరంలో కాల్పులు జరిగాయి. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు.

11

రాష్ట్రీయం

జర్మనీలో పర్యటించాలని శ్రీధర్ బాబుకు ఆహ్వానం

- మంత్రిని ఆహ్వానించిన ఆ దేశ ప్రతినిధులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27 : తమ దేశం జర్మనీలో పర్యటించాలంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆహ్వానం అందింది. టెక్నాలజీ, ఇండస్ట్రీ, ఇన్నోవేషన్, ఇంటర్నేషనల్ బిజినెస్ లో 'తెలంగాణ-జర్మనీ' మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతం చేసేందుకు తమ దేశంలో పర్యటించాలని జర్మన్ బుండెస్ టాగ్ (పార్లమెంట్) సభ్యుడు, ఏఎఫ్‌డీ పార్లమెంటరీ గ్రూప్ ఫారిన్ పాలసీ అధికార ప్రతినిధి, ఇండోజర్మన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ ఛైర్మన్ మార్కస్ ఫ్రోహ్‌న్‌మైయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు.ఈ మేరకు మంత్రి శ్రీధర్ బాబు జనవరిలో జర్మనీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన జర్మనీ ప్రభుత్వ పెద్దలు, కీలక అధికారులు, అక్కడి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రీ నిపుణులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ హై లెవెల్ మీటింగ్స్ లో ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్స్, తెలంగాణలో ఇన్వెస్ట్ మెంట్ ఆపర్చునిటీస్, జర్మనీలో తెలంగాణ కంపెనీలకు మార్కెట్ యాక్సెస్ కల్పించడం, జర్మనీ - తెలంగాణ మధ్య టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, ద్వైపాక్షిక సహకార బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నారు.

డబ్బుకు దాసోహం పోలీస్!!

మొదటిపేజీ తరువాయి

పాల్పడుతుంటారు. కొందరు అక్రమ మార్గాలలోనూ డబ్బు ఎలా సంపాదించాలని ఆలోచించి యూనిఫాంను అడ్డు పెట్టుకొని కేసులలో ముద్దాయిలను తప్పిస్తూ ఉంటారు. డబ్బుపై ఆశ పెరిగి, బెట్టింగ్ వంటి వాటికి అలవాటు పడి తప్పుడు మార్గాలను సృష్టించుకుంటున్న పోలీసులు కొంతమందే అయినా, వారి తీరు మాత్రం అందరిపై ప్రభావాన్ని చూపుతుంది. సమాజానికి మంచి చేయాల్సిన పోలీసే ఇలా అక్రమ మార్గంలో సంపాదించడం ఏంటని?, భవిష్యత్తు తరానికి ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారు? అని ప్రశ్నలు వస్తూ ఉంటాయి.

డబ్బే లక్ష్యంగా తప్పుడు పద్ధతులలో

జల్సాలు, ఆస్తుల సంపాదన లక్ష్యంగా కొందరు పోలీసులు తప్పుడు పద్ధతులలో వెళ్తున్నారు. బెట్టింగ్‌కు అలవాటైన అంబర్‌పేట్ ఎస్ఐ భానుప్రకాశ్‌రెడ్డి తాను రికవరీ చేసిన బంగారం, సర్వీస్ రివాల్వర్ తాకట్టు పెట్టాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించినా పొంతనలేని సమాధానాలు చెప్పినట్టు సమాచారం. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇటీవల ఆర్థిక నేరస్థుడు ఉప్పలపాటి సతీశ్ తప్పించుకునేందుకు సహకరించిన టాస్క్‌ఫోర్స్ ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. నెల వ్యవధిలో ఒక ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఎస్సైలపై సస్పెన్షన్ వేటు పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏసీపీని హెడ్‌క్వార్టర్‌కు ఎటాచ్ చేశారు. మరో నలుగురు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఏసీపీలు, కొందరు ఎస్సైలు, కానిస్టేబుళ్లపై ఆరోపణలు రావటంతో విచారణకు ఆదేశించినట్టు సమాచారం. సహచరులపై వేటు పడుతున్నా కొందరి తీరు మారట్లేదు.

ఎవరి లెక్కలు వారివే

హైదరాబాద్ దక్షిణ మండలంలో ఒక ఇన్‌స్పెక్టర్ ఇటీవల ఓ మహిళ మృతి కేసులో బాధితులను భయపెట్టి రాజీ చేయడంతో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇక్కడ పని చేసిన ఇద్దరు ఎస్ హెచ్‌ఓలు అవినీతి ఆరోపణలు రావడంతో బదిలీపై వెళ్లారు. తూర్పు మండలంలోని రెండు ఠాణాల ఎస్‌హెచ్‌ఓల ఉదాసీనతతో ఎస్సైలు, కానిస్టేబుళ్లు సరిగా పని చేయడం లేదని, రికవరీ డబ్బును పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ మర్దన కేంద్రాలలో తనిఖీల పేరిట రూ.5 వేల నుంచి 10 వేల దాకా వసూలు చేస్తున్నారని అంటున్నారు. ఉత్తర మండలంలోని ఒక స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదును పట్టించుకోకుండా నిందితులకు సహకరించినట్టు ఎస్సైపై ఆరోపణలు వచ్చాయి. ఇతడు గ్రూప్ 2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. బాధితుడు సీపీ సజ్జనార్‌ను కలవడంతో కేసును తిరిగి దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

సైబరాబాద్ లోనూ అదే పరిస్థితి

సైబరాబాద్ కమిషనరేట్ పరిధి పోలీస్ స్టేషన్లలో అక్రమార్జన జోరుగా సాగుతోంది. భూముల విలువలు భారీగా పెరగడంతో ప్రైవేట్ కేసులలో తలదూర్చి కొందరు సీఐలు, ఏసీపీలు అక్రమార్జన చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి నోటీసులు లేకుండా పోలీస్ స్టేషన్ కు పిలిచి బెదిరింపులకు గురి చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. రాజేంద్రనగర్ డీసీపీ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న ఓ సీఐ భూ యజమానిని బెదిరించి రూ. ఐదు లక్షలు దండుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. ఇద్దరు వ్యక్తులు తమ భూమిని ఒకరు కొనుగోలు చేసుకుంటానని కొంత నగదు ఇచ్చి అగ్రిమెంట్ చేసున్నారు. యేదాదిన్నర కావస్తున్నా భూమి రిజిస్ట్రీ చేసుకోకుండా కాలయాపన చేశారు. భూ యజమానులు ఆయనను నిలదీస్తే వేరే వారికి అమ్ముకోవాలని చెప్పగా, వారు విక్రయించారు. ఇది తెలుసుకున్న అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తి తన పలుకుబడితో సీఐని కలిసి తనకు భూ యజమానుల నుంచి డబ్బులు ఇప్పించాలంటూ కోరినట్లు సమాచారం. సీఐ భూ యజమానులను స్టేషన్ కు పిలిచి వారిని బెదిరించడంతో ఒక్కొక్కరు రూ. ఐదు లక్షలు సమర్పించుకున్నట్లు ఆరోపణలున్నాయి. పోలీస్ స్టేషన్ ల మీదప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమార్జనకు అంతం పలుకాలని ప్రజలు వేడుకుంటున్నారు. పోలీస్ శాఖలో పెరుగుతున్న ఈ అవినీతి మరకలున్న వ్యక్తులను కట్టడి చేసే పనిలో పోలీస్ బాస్‌లు ఉన్నారు.

కాశీలో ఘనంగా గంగా హారతి

- దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 27: మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి గురువారం నాడు కాశీ విశ్వనాథ దేవాలయాన్ని దర్శించుకున్నారు. గంగా నదిలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోయి పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని నమ్మకం. అలాంటి పుణ్యక్షేత్ర గంగా హారతిని ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప రెడ్డి, కొండ నగేష్, మంజుల మేడం దర్శించుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ఇది మొదటి జ్యోతిర్లింగం, దీనిని స్వర్ణ దేవాలయం అని కూడా అంటారు. శివలింగం ఒక కాంతి స్తంభం రూపంలో ఉంటుందని నమ్మకం, ఇది భూమిని చీల్చుకుని స్వర్గం వైపు విస్తరించింది.. ఆలయాన్ని "శ్రీ కాశీ విశ్వనాథదేవాలయం"అని పిలుస్తారు, ఎందుకంటే ఇది కాశీ నగరంలో ఉంది. శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం వారణాసి అనువదించబడింది' అని తెలిపారు.

బీసీ కోటా కోసం గళమెత్తండి

మొదటిపేజీ తరువాయి

ఏర్పడి గళం ఎత్తాలని భట్టి కోరారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను విజ్ఞప్తులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్లు చెప్పారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీలు అడిగిన సమాచారం నిమిషాలలో లేదా గంటలలో అందించేందుకు ఢిల్లీలో ఆర్థిక, ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంపీలంతా వినియోగించుకోవాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రభుత్వ శాఖలు ఏ విధంగా పూర్తి సంసిద్ధంగా ఉంటాయో పార్లమెంటు సమావేశాల సందర్భంగానూ ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధంగా ఉంటూ ఎంపీలకు సమాచారం అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జీఎస్టీ తదితర విషయాలకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు, పథకాల కు సంబంధించి గతంలో లేఖలు రాశామని, ఆ లేఖలు ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపీలకు అందుబాటులో ఉంటాయన్నారు. వాటి ఆధారంగా ఎంపీలు ఫాలోఅప్ చేసే అవకాశం ఉంటుందని సూచించారు. డిసెంబర్ తొమ్మిది నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంలో, సాధించిన విజయాలను వివరించడంతోపాటు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేయబోతున్నామని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రులను, ఎంపీలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామన్నారు.

ప్రధానమంత్రి సమయం తీసుకుని

రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్, ఇతర సమస్యలపై ప్రధానమంత్రి సమయం తీసుకుని సమిష్టిగా కలుద్దామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్ కేడర్ అలాట్ మెంట్ గురించి పూర్తి సమాచారం అందిస్తే, సంబంధిత మంత్రిని పార్టీలకు అతీతంగా కలసి లేఖ ఇద్దామన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రతిపాదించిన విషయం ఆహ్వానించదగ్గదని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి చెప్పారు. పోలవరం పూర్తయితే బ్యాక్ వాటర్ వల్ల తమ నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతారని మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్ చెప్పారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా? అని ఎంపీ కడియం కావ్య అడిగారు. ఈ విషయంపై కేంద్రానికి లేఖ రాయడంతో పాటు సమావేశాలలో లేవనెత్తాలని అన్నారు.

'ట్యాపింగ్' కేసులో కీలక పరిణామం

మొదటిపేజీ తరువాయి

తెలిసింది. నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీవీ సజ్జనార్ ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు విచారణ ఏ దశలో ఉంది? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్లు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. కేసు దర్యాప్తుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని విచారించినట్లుగా తెలుస్తోంది. ట్యాపింగ్ కేసులో బాధితులు, నిందితులను ఇప్పటికే పలువిడతలుగా సిట్ విచారించింది. నలుగురు పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేసింది. కేసులో కీలక నిందితుడు రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో 'భారత రాష్ట్ర సమితి సుప్రీం' అనే పదాన్ని వాడారు. అంటే, కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ట్యాపింగ్‌కు పాల్పడ్డామని రాధాకిషన్‌రావు చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం కేసీఆర్‌కు ఓఎస్డీగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డిని విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.

పకడ్బందీగా పంచాయితీ ఎన్నికలు

- పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్

ప్రతిపక్షం రంగారెడ్డి బ్యూరో, నవంబర్ 27: గ్రామ పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండ పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని అన్నారు. గురువారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. మొదటి విడత ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైనందున నోడల్ అధికారులు అవసరమైన అన్ని మెటీరియల్స్ తో సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్వోలు, ఏఆర్ఓలు, పీఓ,ఏపీఓలు, జోనల్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలను సీరియస్ గా తీసుకోవాలని, నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుండి లేదా ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతి రోజూ నివేదికలు పంపే విధంగా చూడాలన్నారు. అలసత్వానికి తావివ్వవద్దని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు, డీపీఓ సురేష్ మోహన్, నోడల్ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణకు ప్రధాని సహకరించాలి

మొదటిపేజీ తరువాయి

దక్కుతుందని అన్నారు. బీసీల 42శాతం రిజర్వేషన్ గురించి రాజ్యాంగ సవరణకు కూడా ప్రధాని సహకరించాలన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రయత్నం వల్లనే తెలంగాణలో కులగణన, బీసీ రిజర్వేషన్ బిల్లు సాధ్యమైందన్నారు. అందరినీ కలుపుకుని గ్రామస్థాయి నుండి బలమైన ఉద్యమాలు నిర్మిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటు క్షేత్ర స్థాయిలో అటు దిల్లీ కేంద్రంగా బీసీ సమాజం ఉద్యమించాలని ప్రజా ఐక్య కూటమి నినదించింది. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకు ఎదురవుతున్న సవాళ్లు - పరిష్కారాలు, తదుపరి కార్యాచరణ' అన్న అంశంపై అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రజా ఐక్య కూటమి జెండా, ఎజెండాను బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ప్రజా ఐక్య కూటమి ఛైర్మన్ గా దాసు సురేశ్ నియుక్తులయ్యారు. కోర్ లీడర్ షిప్ కమిటీ సభ్యులుగా తులసి శ్రీమాన్, మారేపల్లి లక్ష్మణ్, పోశాల సరస్వతి, ఊరుమల్ల విశ్వం ,అయిల ప్రసన్న, షక్రుద్దీన్, నూనె రమేశ్ ముదిరాజ్, గంటా సత్య నారాయణను ప్రకటించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయం ద్వారానే 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతాయని దాసు సురేష్ అన్నారు.

చైనా, జపాన్‌లా అభివృద్ధి చెందాలి

మొదటిపేజీ తరువాయి

విభజించి అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి (క్యూర్), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్) గా మూడు రీజియన్లను విభజించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండదు అని చాటి చెప్పేలా తెలంగాణ రైసింగ్ పాలసీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రసమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగ తెలంగాణ ప్రభుత్వం విజన్ 2047కు సిద్ధమౌతోంది. అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్ధే టార్గెట్ గా రానున్న 22 ఏండ్లకు ఈ భవిష్యత్ కార్యాచరణ ఉండబోతోంది. ఫ్యూచర్ సిటీతో రాష్ట్ర భవిష్యత్ ను కొత్త పుంతలు తొక్కించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సిద్ధమౌతోంది. అందుకే డిసెంబర్ 8,9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించబోతోంది.

ప్రపంచ పెట్టుబడిదారుల ముందు

దీనిపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, అజారుద్దీన్, సీతక్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో ఉన్న అపారమైన పెట్టుబడుల అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచటంతో పాటు, ఇక్కడ ఇన్వెస్ట్ చేయటం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ రెండు రోజుల్లో షో కేస్ చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. అందుకే ఈవెంట్ ను కూడా భవిష్యత్ ఫోర్త్ సిటీలో ప్రభుత్వం ప్లాన్ చేసింది. విభిన్న రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను వివరించటం, వివిధ రూపాల్లో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ప్రకటించనుంది.

బీసీలకు కాంగ్రెస్ నమ్మకద్రోహం

- కాంగ్రెస్, బీజేపీ రాజకీయ క్రీడలు ఆపాలి
- మందకృష్ణ మాదిగ, జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ఇచ్చిన హామీ గాలికి వదిలేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నమ్మిచి బీసీలను దగా చేసిందని ఎంఆర్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ, బీసీ సంఘాల నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. 'కుల గణన చేయడం, బీసీలు 52 శాతమని తేల్చడం, క్యాబినెట్ లో నిర్ణయం చేయడమే కాదు, రిజర్వేషన్ అమలు జరిగే వరకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత' అని పేర్కొన్నారు. ఇంతకాలం ఆగి మళ్లీ ఇంతతక్కువ శాతం కోటా బీసీలకు ఇవ్వడం అన్యాయమని చెప్పారు. ఐదు వేలకు పైగా రావాల్సిన సర్పంచుల స్థానంలో రెండు వేలు కూడా రావడం లేదంటే ప్రభుత్వం ఎంత మోసం చేసిందో అర్థమవుతుందన్నారు. బీసీలకు రావలసిన వాటాను గండి కొట్టి, వాటిని ఉన్నతవర్గాలకు అప్పగించడం కోసం చేసిన నిర్ణయంగానే దీనిని భావిస్తున్నామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయలేని రాహుల్ గాంధీ తెలంగాణ సమాజానికి ఏం సందేశం ఇస్తారో చెప్పాలన్నారు. 42 శాతం కోటా పార్టీ పరంగా ఇస్తామని చెప్పడం ఈ దశాబ్దాపు జోకుగా చూడాలని ఎద్దేవా చేశారు. కోర్టు తీర్పు వచ్చేదాకా కూడా ఆగకుండా తొందరపడి కాంగ్రెస్ నమ్మక ద్రోహం చేసిందన్నారు. గతంలో 23 శాతం ఇచ్చినదాన్ని పెంచకుండా 17 శాతం కు తగ్గించడమేంటని ప్రశ్నించారు. 42 శాతం ఇచ్చాకనే ఎన్నికలకు వెళతాన్న మాట ఏమైందని నిలదీశారు.

నామినేషన్ల పక్రియ సజావుగా సాగాలి

- కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్, కలెక్టర్

ప్రతిపక్షం రంగారెడ్డి బ్యూరో, నవంబర్ 27: నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివకుండా క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్ పాటిల్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన శంషాబాద్ మండలం పెద్దతుప్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధులలో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. జనరల్ అబ్జర్వర్ వెంట శంషాబాద్ ఎంపీడీఓ మున్నీ, తహసీల్దార్లు ఉన్నారు.

2019 గ్రూప్2 ర్యాంకర్లకు భారీ ఊరట

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: తెలంగాణ హైకోర్టులో 2019 గ్రూప్-2 ర్యాంకర్లకు గురువారం భారీ ఊరట లభించింది. 2019 సెలెక్షన్ లిస్ట్‌ను రద్దు చేస్తూ నవంబర్ 18న సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. మెరిట్ లిస్ట్ చెల్లదని ప్రకటించిన సింగిల్ బెంచ్ ఆదేశాలను నిలిపివేసి ర్యాంకర్లకు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసులో మరిన్ని వాదనలు వినాలని నిర్ణయించింది. టీజీపీఎస్సీ) 2015లో 1,032 గ్రూప్2 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2016 నవంబర్‌లో జరిగిన పరీక్షల ఫలితాలు 2019 అక్టోబర్ 24న విడుదలయ్యాయి. అయితే, ఈ ఫలితాలపై తీవ్ర వివాదాలు ఏర్పడ్డాయి. ఓఎమ్ఆర్ షీట్లలో అవకతవకలు, వైటెనర్ ఉపయోగం, ఎరేసర్ మార్కులు, డబుల్ బబులింగ్ వంటివి జరిగాయని గుర్తించారు. ప్రభుత్వం నియమించిన సాంకేతిక కమిటీ 2017లో ఇలాంటి షీట్లను మూల్యాంకనం చేయకూడదని సిఫారసు చేసింది. కానీ, టీజీపీఎస్సీ ఈ మార్గదర్శకాలను పాటించకపోవడంతో, అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు.

అమరావతిని రాజధానిగా గుర్తించాలని కేంద్రాన్ని కోరాం. రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ గడువును పొడిగించే అంశంపై కేంద్రంతో మాట్లాడతాం. అమరావతి అభివృద్ధి చెందాలి. ఈ ఫలాలను ఇక్కడి రైతులే ముందు అందుకోవాలి. వారికి న్యాయం చేయడం నా బాధ్యత. రెండో విడత ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకుని అభివృద్ధి చేద్దామని చూస్తున్నాం.

\- రాజధాని రైతులతో ఏపీ సీఎం చంద్రబాబు

'ఇండస్ట్రియల్' పాలసీపై అసత్య ప్రచారం

- నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- అందుకే బయటికి పరిశ్రమల తరలింపు
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27 : ప్రభుత్వం ఏ మంచి పని చేసినా, ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తూ బురద చల్లేందుకు యత్నిన్నాయని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్ లో గురువారం నాడు ఆయన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో వినతి పత్రాలు స్వీకరించారు. అనేక ఫిర్యాదులపై అధికారులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నగరాన్ని పొల్యూషన్ ఫ్రీ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. ఈ పాలసీలో ఎలాంటి కుంభకోణానికి ఆస్కారమే లేదన్నారు. ఇది అత్యంత పారదర్శక పాలసీ అని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు పాలసీ అర్థం కాలేదని ఎద్దేవా చేశారు. కావాలనే ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని, ఎలాంటి అవినీతి జరగలేదని వారికి కూడా తెలుసునని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతో ప్రజలలో స్పందన వస్తుండడంతో తట్టుకోలేక ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకి పంపాలని డిమాండ్ ఉందని, ఇది కొత్త డిమాండ్ కాదని అన్నారు. విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో 50 వేల కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుందని, 50 వేల కోట్లు కాదు కదా! 50 వేల రూపాయల కుంభకోణం కూడా జరగలేదని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం అని, గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని పరికరాలు కొనుగోలు చేసి సబ్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని నిర్మించారని ఆరోపించారు. ఇది ఎందుకూ ఉపయోగించలేని పరిస్థితి ఉందని అన్నారు.

రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం

- కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కావాలని ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27 : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ ఐదు లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ యేడాది జూన్ 12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. దీంతో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

కాళోజీ వర్సిటీలో అవకతవకలు

- ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి
- గవర్నర్, ఎన్ఎంసీకి హరీశ్ రావు లేఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: కాళోజీ యూనివర్సిటీలో అవినీతి ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్న నేపథ్యంలో, గవర్నర్, నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు, వివాదాలకు కేంద్రంగా మారడం అత్యంత విచారకరమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ యూనివర్సిటీ చుట్టూ జరిగిన పరిణామాలు వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు, వైద్య వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారితీశాయని పేర్కొన్నారు. మార్పు తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే స్కాంలకు స్థావరంగా మారిందని ఆయన ఆరోపించారు. విద్యా సంస్థలు కూడా అవినీతి కేంద్రాలుగా మారడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. పీజీ వైద్య పరీక్షల రీవాల్యుయేషన్ ప్రక్రియలో అనేక అనుమానాస్పద పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ, ప్రభుత్వం మౌనం పాటించడం ఆందోళనకరమని అన్నారు. ఫెయిల్ అయిన ఐదుగురు విద్యార్థులు కొద్ది రోజులలో ఎలా పాస్ అయ్యారు? వారందరూ ప్రైవేట్ మెడికల్ కాలేజీల విద్యార్థులేనా! అనే ప్రశ్నలను లేవనెత్తారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. నందకుమార్ రెడ్డి పాత్రపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని హరీశ్ రావు ప్రశ్నించారు.

బీసీలను మోసం చేసింది మీరు కాదా?

- 34 % ఉంటే 22శాతానికి తగ్గించారు
- కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క కౌంటర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల వాటాను 17 శాతానికి తగ్గించిందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్రంగా మండిపడ్డారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీ రిజర్వేషన్ ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికలలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, కానీ, 2019 ఎన్నికలలో బీఆర్ఎస్ ప్రభుత్వం 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గతంలో రాష్ట్రాన్ని ఒక యూనిట్ గా బీఆర్ఎస్ తీసుకుందని ధ్వజమెత్తారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామన్నారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కులగణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు.

పాలమూరుకు రేవంత్ చేసింది శూన్యం

- పేర్లు పెట్టుకోవడం తప్ప సాధించిందేమీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: కేసీఆర్ హయాంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో అద్భుత అభివృద్ధి జరిగిందని కేటీఆర్ అన్నారు. వలసల జిల్లాగా పేరొందిన పాలమూరులో రివర్స్ మైగ్రేషన్ సాధ్యమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన 'పాలమూరు – రంగారెడ్డి' ఎత్తిపోతల పథకంలో మిగిలిన పది శాతం పనులను కూడా రేవంత్ రెడ్డి పూర్తి చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. నర్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ వంటి రిజర్వాయర్లను పూర్తి చేసి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డనని చెప్పుకోవడం, ప్రాజెక్టులకు మామ పేరు పెట్టుకోవడం తప్ప, ఇప్పటివరకు రైతులకు ఒక్క చుక్క నీరు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్టీఆర్ వంటి మహానాయకుడే కల్వకుర్తిలో ఓడిపోయారని గుర్తు చేశారు. రాజకీయాలలో గెలుపోటములు సహజమని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కరెంట్ కష్టాలు లేకుండా సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి 24 గంటల కరెంట్ ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ కోతలు, రైతుల కష్టాలు మొదలయ్యాయని, ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. చరిత్రలో ఏ ప్రభుత్వం పైన లేనంత ప్రజా వ్యతిరేకత కాంగ్రెస్‌పై ఉందని, ప్రజల వెంట మనం ఉంటే, వారే తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాడుతూ ఐక్యంగా ముందుకు సాగాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలి

- అందుకోసం అందరం కలిసి పని చేద్దాం
- యావత్ ప్రపంచం ప్రయోజనం పొందాలి
- జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కలిసి పని చేద్దామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సాయంత్రం ఆయన ప్రజా భవన్ లో జర్మనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యావత్ ప్రపంచం ప్రయోజనం పొందాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ దేశాల రాజకీయ పార్టీలను ఒకచోట చేర్చి పురోగమన ఆలోచనా దిశలో నడిపించే వారి కృషిని ఎంతో అభినందిస్తున్నామన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలోనూ, వృద్ధి చెందుతున్న దేశాలలోనూ రైట్ వింగ్ భావజాలం ప్రమాదకరంగా మారుతోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలకు, వాటి విలువలకు ప్రమాదం కలిగించే, ఈ భావజాల వ్యాప్తితో ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. స్వేచ్ఛ- న్యాయం- ఐక్యత అనే సిద్ధాంతాలతో నడిచే సోషియల్ డెమొక్రటిక్ పార్టీ స్వతంత్ర సంస్థలా పని చేస్తూ ప్రపంచంలోని రాజకీయ పార్టీలతో కలిసి ప్రోగ్రెసివ్ ఆలోచనను ముందుకు తీసుకెళ్లడం చాలా అభినందనీయమని అన్నారు. తాము ఈ దేశానికి స్వాతంత్రాన్ని తీసుకు రావడంతో పాటు దేశ నిర్మాణంలోనూ అత్యంత కీలకంగా నిలిచిన పార్టీకి చెందిన వారమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీని వారు కలవడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, బలరామ్ నాయక్, సురేష్ షెట్కార్, జర్మనీకి చెందిన ఫ్రెడ్రిచ్ ఈబర్ట్ స్టిఫ్టింగ్ సంస్థకు చెందిన ప్రతినిధులు డాక్టర్ సబీనా, మిక్రో గ్యాంథర్, క్రిస్టోఫస్, మాండ్వి కులక్షేత్ర, అనురాగ్ శంకర్ పాల్గొన్నారు.

నిజాంసాగర్ సమస్యలను పరిష్కరించాలి

- రైతులకు కష్టనష్టాలను తొలగించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 27: కామారెడ్డి జిల్లాలో నెలకొన్న సమస్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కవిత గురువారం నాడు కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. జుక్కల్ నియోజకవర్గంలో సాగునీటి సమస్యలు తీవ్రమై ఉన్నాయని తెలిపారు. నిజాం సాగర్ ప్రాజెక్టు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ, జుక్కల్‌కు ప్రయోజనం కలగని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. జుక్కల్‌లో చెరువుల ద్వారా 22 వేల ఎకరాలు, కైలాస్ నాలా ద్వారా 9 వేల ఎకరాలు మాత్రమే సాగవుతున్నాయని, మహారాష్ట్రతో ఉన్న పంచాయతీ కారణంగా లెండి ప్రాజెక్ట్ సంవత్సరాలుగా నిలిచిపోయిందని విమర్శించారు. నీళ్లు రావనే భయం నెలకొన్న నేపథ్యంలో, ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వం డీపీఆర్ విడుదల చేయాలని, ఏ గ్రామాలు ముంపునకు గురవుతాయో స్పష్టత ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. గత ప్రభుత్వమూ, ప్రస్తుత ప్రభుత్వమూ డీపీఆర్ సిద్ధం చేయలేదని విమర్శించారు. జాగృతి పర్యటన సమాచారం అందిన తర్వాత రెండు రోజులు మాత్రమే మోటార్లు ఆన్ చేసిన విషయాన్ని ఆమె ఎత్తిచూపారు. నిజాం సాగర్ ప్రాజెక్టు వద్ద చీఫ్ ఇంజనీర్ నవాజ్ అలీ జంగ్ బహదూర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కవిత, ఈ ప్రాజెక్టును మన వారసత్వ సంపదగా పేర్కొన్నారు.

బీఆర్ఎస్వీ విభాగం పాటను ఆవిష్కరించిన కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగారం ప్రశాంత్ రూపొందించిన విద్యార్థి విభాగం పాటను గురువారం నాడు నందినగర్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ శాసన సభ్యులు డా. గాదరి కిషోర్ కుమార్ , ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్ బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్, రాష్ట్ర నాయకులు వల్లమల్ల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ గౌడ్ , మిథున్ ప్రసాద్, సంతోష్, సింగర్స్ మద్దెల సందీప్ గౌడ్, మానుకోట ప్రసాద్ పాల్గొన్నారు.

నర్సాపూర్ కాంగ్రెస్‌కు భారీ షాక్

- బీఆర్ఎస్ గూటికి చేరిన కీలక నేతలు
- 'స్థానిక' ఎగిరేది గులాబీ జెండాయే
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పలువురు కీలక నాయకులు గులాబీ గూటికి చేరారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో, మాజీ మంత్రి హరీశ్ రావు సమక్షంలో మాజీ జడ్పీటీసీ శరత్ చంద్ర, నర్సింహారెడ్డి, మల్లేశం, అరవింద్ బాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీశ్ రావు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే 'నయవంచన' అని, ప్రతి వర్గాన్ని మోసం చేసిన చరిత్ర ఆ పార్టీదని ఆరోపించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, ఏ ఒక్కరికీ మేలు జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, నేడు కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో పయనిస్తోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు కేవలం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికేనని ఆరోపించారు. వృద్ధులకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, విద్యార్థులకు విద్యా భరోసా, నిరుద్యోగులకు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీలు.. ఇలా అన్నివర్గాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

అయ్యప్ప దీక్ష తీసుకుంటే ఆంక్షలా!

- ఎస్ఐకి ఇచ్చిన మెమోను ఉపసంహరించాలి
- డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించిన స్వాములు, బీజేవైఎం నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27: డీజీపీ కార్యాలయం వద్ద గురువారం నాడు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విధి నిర్వహణలో ఉండి అయ్యప్ప మాల ధరించినందుకు కంచన్‌బాగ్ ఎస్ఐ కృష్ణకాంత్ కు ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు. దీనిని నిరసిస్తూ అయ్యప్ప స్వాములు, బీజేవైఎం కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఎస్ఐకి ఇచ్చిన మెమోను బేషరతుగా వెనక్కి తీసుకోవాలంటూ డీజీపీ ఆఫీస్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో భారీ సంఖ్యలో అయ్యప్ప స్వాములు, బీజేవైఎం కార్యకర్తలు అక్కడకు చేరుకుని డీజీపీ ఆఫీసులోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ముందుగానే మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. యూనిఫాంపై ఇలాంటి ఆంక్షలు విధించడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆందోళనకారులు ఆరోపించారు. శాంతియుతంగా వినతి పత్రం ఇస్తామని చెబుతుంటే, తమను అక్రమంగా అరెస్టు చేసి లాఠీ ఛార్జ్ చేసి బలవంతంగా అక్కడి నుంచి నెట్టేశారని స్వాములు, బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. కాగా, పోలీసులు కొందరిని మాత్రమే డీజీపీ కార్యాలయంలోనికి అనుమతించారు. వారు అడిషనల్ డీజీపీకి మెమోరాండం ఇచ్చారు. అనంతర్ మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం లోగా ఎస్సైకి ఇచ్చిన మెమోను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త నిరసనలు చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో నగరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

"ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేసుకోవాలి. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా విభజించుకోవాలి. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండదని చాటి చెప్పేలా తెలంగాణ రైజింగ్ పాలసీ డాక్యుమెంట్ ఉండాలి.

-రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై సమీక్షలో సీఎం రేవంత్

ఓపెన్ వాయిస్

అంతర్గత భద్రత మీద కేంద్రం దృష్టి

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ లక్ష్యం వికసిత భారత్..2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడం. అభివృద్ధి అంటే ప్రతి రంగంలోనూ ముందుండటం. అందులో కీలకమైన దేశ అంతర్గత భద్రతపై దృష్టి సారించింది కేంద్రం. ఇందుకోసం దేశ అంతర్గత భద్రతను బలోపేతం చేయడంపై పోలీస్ ఉన్నతాధికారుల వార్షిక సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 28 నవంబర్ నుంచి మూడు రోజులపాటు రాయపూర్ లో 60వ అఖిల భారత డీజీపీ, ఐజీపీల అత్యున్నత భద్రతా అధికారుల సమావేశాలు జరగనున్నాయి. ఐఐఎం నయా రాయ్‌పూర్ క్యాంపస్‌లో జరగనున్న సమావేశాలలో ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వివిధ రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొంటారు. 'వికసిత భారత్- భద్రతా ప్రమాణాలు' అనే థీమ్ తో జరగనున్న ఈ సమావేశాలలో పలు పోలీసింగ్ సవాళ్లను పరిష్కరించడంలో సాధించిన పురోగతి మీద సమీక్ష జరగనుంది. సురక్షిత భారత్ నిర్మాణం కోసం భవిష్యత్తు లక్ష్యాల గురించి రోడ్‌మ్యాప్ రూపొందించనున్నారు. వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాద నిరోధం, విపత్తు నిర్వహణ, మహిళల భద్రత, పోలీసింగ్‌లో ఫోరెన్సిక్ సైన్స్, ఏఐ వాడకం మీదా చర్చలు జరగనున్నాయి. 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్'లో ఈ సమావేశాలు జరుగుతాయి. వివరణాత్మక చర్చల అనంతరం, విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన పోలీసులకు రాష్ట్రపతి పోలీసు పతకాలను ప్రధానమంత్రి అందజేస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ పోలీసు అధికారులు, భద్రతా నిర్వాహకులు విస్తృత శ్రేణి జాతీయ భద్రతా సమస్యలపై బహిరంగ, అర్థవంతమైన చర్చలలో పాల్గొనడానికి ఈ సమావేశం ఒక కీలక ఇంటరాక్టివ్ వేదికను అందిస్తుంది. నేరాలను పరిష్కరించడంలో, శాంతిభద్రతలను కాపాడుకోవడంలో, అంతర్గత భద్రతా ముప్పులకు ప్రతిస్పందించడంలో వృత్తిపర పద్ధతులను రూపొందించడం, పరస్పర సహకారం అందించుకోవడంతో పాటు, పోలీసు దళాలు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్యాచరణ, మౌలిక సదుపాయాలు సంక్షేమ సంబంధిత సవాళ్ల మీద ఈ సమావేశాలలో చర్చలు జరగనున్నాయి.2014 నుండి, ప్రధానమంత్రి మార్గదర్శకత్వంలో పోలీసు ఉన్నతాధికారుల సమావేశం ఫార్మాట్ నిరంతరం అప్‌గ్రేడ్ చేయబడుతుంది. అందులో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో డీజీపీ-ఐజీపీ వార్షిక సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ దేశ అంతర్గత భద్రతను ముమ్మరం చేస్తున్నారు. గతంలో గౌహతి (అసోం), రాన్ ఆఫ్ కచ్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), టెకన్‌పూర్ (గ్వాలియర్, మధ్యప్రదేశ్), స్టాట్యూ ఆఫ్ యూనిటీ (కెవాడియా, గుజరాత్), పూణే (మహారాష్ట్ర), లక్నో (ఉత్తరప్రదేశ్), న్యూఢిల్లీ, జైపూర్ (రాజస్థాన్) , భువనేశ్వర్ (ఒడిశా)లో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఈసారి సమావేశాలు ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లో జరుగుతున్నాయి. అటు ప్రధాని నరేంద్ర మోడీ ఈ వార్షిక సమావేశాలపై నిరంతరం ఆసక్తి కనబరుస్తూ, అర్థవంత చర్చలను ప్రోత్సహిస్తూ, పోలీసింగ్ పై కొత్త ఆలోచనలు వెలువడే వాతావరణాన్ని పెంపొందిస్తున్నారు. అంతర్గత భద్రత విధాన విషయాలపై ప్రధానమంత్రితో కొందరు పోలీసులు నేరుగా తమ దృక్పథాలను,అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది. మూడు రోజులపాటు జరిగే సమావేశాలలో కేంద్ర హోమ్ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, హోమ్ సహాయ మంత్రులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలు, కేంద్ర పోలీసు సంస్థల అధిపతులు పాల్గొంటారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
28.11.2025

ఉచితం, ఆర్థిక భవిష్యత్తుకు ప్రమాదం?

ఉచితాల సంస్కృతి ఆర్థిక వ్యవస్థకే కాకుండా, ప్రజల శ్రమ సంస్కృతికి పెను ప్రమాదంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఉచిత పథకాలతో తమిళ ప్రజలు బద్ధకస్తులుగా మారిపోయారని, ఈ కారణంగా స్థానిక పనులు హోటళ్లు, సెలూన్‌లు, వ్యవసాయ పనుల కోసం కూడా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. 'కొన్నాళ్లైతే అన్నం కూడా వండి తినిపిస్తారేమో' అంటూ నాయకుల హామీలను ధర్మాసనం ఎద్దేవా చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది.

వెంకగారి భూమయ్య
9848559863

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి కీలక దక్షిణ భారత రాష్ట్రాలలో రాజకీయ పార్టీలు అమలు చేస్తున్న ఉచిత పథకాల సంస్కృతి ఇప్పుడు ఒక పెను సవాలుగా మారింది. ఈ భారీ సంక్షేమ హామీలు ప్రజలకు తక్షణ ఊరటనిస్తూ, పౌరుల జీవన ప్రమాణాలను కొంతవరకు మెరుగుపరుస్తున్నాయనే సామాజిక ప్రయోజనం ఒకవైపు కనిపిస్తుండగా, మరోవైపు రాష్ట్ర ఖజానాపై శాశ్వత రుణభారాన్ని మోపి, శ్రామిక వర్గాన్ని పని చేయడానికి విముఖత చూపే 'సోమరిపోతులుగా' తయారు చేస్తున్నాయనే తీవ్ర ఆర్థిక ఆందోళన వ్యక్తమవుతోంది. తమ హక్కుగా ప్రజలు వీటిని స్వాగతిస్తున్నప్పటికీ, ఆర్థిక క్రమశిక్షణను పాటించకుండా అధికారంలోకి రావడమే లక్ష్యంగా నాయకులు ఇస్తున్న అసంబద్ధ హామీలు, రాష్ట్రాల దీర్ఘకాలిక భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయనే గందరగోళ పరిస్థితి నెలకొంది.

బలపడుతున్న 'రివర్స్ ట్యాక్స్' సంస్కృతి

ఎన్నికలు సమీపించినప్పుడల్లా అన్ని రాజకీయ పార్టీలు 'ఉచిత హామీల'ను అస్త్రాలుగా ప్రయోగిస్తున్నాయి. తెలంగాణలో రైతుబంధు, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి వంటి నగదు బదిలీ పథకాలపై దృష్టి పెడితే, ఆంధ్రప్రదేశ్‌లో అమ్మఒడి, పెంచిన పింఛన్లు వంటి పథకాలు ప్రజల జీవనంలో కీలకంగా మారాయి. అదేవిధంగా కర్ణాటకలో గృహలక్ష్మి, శక్తి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) వంటి పథకాలు అమలులోకి వచ్చాయి. ఈ పథకాలన్నీ కోట్లాది మంది ప్రజల ఓట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక నిపుణులు ఈ ధోరణిని 'రివర్స్ ట్యాక్స్'గా అభివర్ణిస్తున్నారు. అంటే, పన్ను చెల్లించే వారిపై మరింత భారం వేసి, తద్వారా వచ్చే ఆదాయాన్ని ఉత్పాదకత లేని రంగాలలోకి మళ్లించడం. ఈ ఉచితాల అమలు కోసం పాలక పక్షాలు తమ పార్టీ మేనిఫెస్టోలను అమలు చేయడంపై దృష్టి పెడుతున్నాయే తప్ప, వాటికి అవసరమైన నిధుల సమీకరణపై కానీ, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వంపై కానీ సరైన ప్రణాళికలు రచించడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

రాష్ట్ర ఖజానాపై పెరుగుతున్న రుణభారం

ఉచిత పథకాలు రాజకీయంగా లాభదాయకంగా ఉన్నప్పటికీ, ఆర్థికంగా ఇవి రాష్ట్ర ఖజానాకు శాపంగా మారుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఈ పథకాల అమలు కోసం చేస్తున్న ఖర్చుల వల్ల వాటి అప్పుల భారం ప్రతి సంవత్సరం గణనీయంగా పెరుగుతోంది. ఈ భారీ వ్యయాన్ని తట్టుకోవడానికి ప్రభుత్వాలు నిరంతరం అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ అప్పుల భారం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ)లో అధిక శాతాన్ని ఆక్రమించుకోవడం వల్ల, రాష్ట్రాలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని కేవలం అప్పులపై వడ్డీ చెల్లించడానికి మాత్రమే వినియోగిస్తున్నాయి. దీని ఫలితంగా, రోడ్లు, సాగునీరు, విద్యుత్ ప్రాజెక్టుల వంటి దీర్ఘకాలిక ఉత్పాదకతను పెంచే మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత ఏర్పడుతోంది. ఈ ఆర్థిక బాధ్యతారాహిత్యం వల్లనే అనేక రాష్ట్రాలలో ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఈ ధోరణి కొనసాగితే, భవిష్యత్ తరాలు కేవలం అప్పులను తీర్చడానికే పని చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఉపాధిపై ఉచితాల ప్రభావం

ఉచితాల సంస్కృతి ఆర్థిక వ్యవస్థకే కాకుండా, ప్రజల శ్రమ

సంస్కృతికి పెను ప్రమాదంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఉచిత పథకాలతో తమిళ ప్రజలు బద్ధకస్తులుగా మారిపోయారని, ఈ కారణంగా స్థానిక పనులు హోటళ్లు, సెలూన్‌లు, వ్యవసాయ పనుల కోసం కూడా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. 'కొన్నాళ్లైతే అన్నం కూడా వండి తినిపిస్తారేమో' అంటూ నాయకుల హామీలను ధర్మాసనం ఎద్దేవా చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఈ పథకాలతో తాత్కాలికంగా డబ్బు చేతికి రావడంతో, శారీరక శ్రమతో కూడిన పనులు చేయడానికి స్థానిక కార్మికులు ఆసక్తి చూపడం లేదు. దీనివల్ల స్థానిక ఉపాధి, ఉత్పాదకత దెబ్బతిని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వలస కార్మికులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

నిబంధనల కొరత, రాజకీయ ఆత్మవంచన

ఉచిత హామీలు ఇచ్చేటప్పుడు రాజకీయ పార్టీలకు కఠిన నిబంధనలను రూపొందించడంలో ఎన్నికల సంఘం లేదా కేంద్ర ప్రభుత్వం విఫలమవడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. ఉచిత హామీలతో ఓటర్లు ప్రభావితమవుతున్నందున, వీటిని అవినీతి వ్యవహారంగా పరిగణించాలని, నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని మద్రాస్ హైకోర్టు వంటి న్యాయస్థానాలు కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘానికి సూచించాయి. అయితే, ఈ ఉచితాలను నియంత్రించే బాధ్యత కేంద్రానిదా, లేక ఈసీదా అనే అంశంపై స్పష్టత లేకపోవడం రాజకీయ పార్టీలకు వరంగా మారింది. అంతేకాకుండా, అధికారంలో లేని పార్టీలు ఉచితాలపై విమర్శలు చేస్తున్నప్పటికీ, తాము అధికారంలోకి రాగానే అంతకు మించిన ఉచిత పథకాలను అమలు చేస్తామని హామీ ఇవ్వడం రాజకీయ ఆత్మవంచనకు నిదర్శనంగా నిలుస్తోంది. మొత్తం మీద, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ ఉచితాల సంస్కృతి ఆర్థికంగా, సామాజికంగా దీర్ఘకాలిక సమస్యలను సృష్టిస్తున్నందున, ఇటు ప్రజలు, అటు పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

పరస్పర సహకారంతో సత్సమాజం

ఎండీ ఉస్మాన్ ఖాన్
99125 80645

మనిషి జీవితం ప్రారంభం నుండే సంబంధాలు కూడా మొదలవుతాయి. పుడమిపై పాదం మోపింది మొదలు తల్లి దండ్రులు, బంధువులు, సమాజంతో జీవిస్తున్నంతకాలం, అనివార్యంగా మన పొరుగింటి వారితో కూడా బంధం ఏర్పడుతుంది. రక్త సంబంధం కాకపోయినప్పటికీ, జీవితంలో అకస్మాత్తుగా మనకు అత్యంత దగ్గరగా ఉండేవారు పొరుగువారే. ఈ బంధం మనం ఎంచుకున్నది కాదు, కానీ మన మంచితనాన్ని, మన సంస్కారాన్ని, మన మనసు లోతులను ప్రతిబింబించే ఒక సహజ సంబంధం. ఇప్పటి జీవనశైలి వేగంగా మారింది. అపార్ట్‌మెంట్లు పెరిగాయి, గేటెడ్ కమ్యూనిటీలు ఏర్పడ్డాయి, మెట్లు, లిఫ్టులు, కారిడార్లలో ప్రశాంత నిశ్శబ్దం కనిపిస్తోంది. కానీ, ఈ అభివృద్ధి వెనుక ఒక పెద్ద నష్టమూ జరుగుతోంది. మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. వందల ఇళ్ల మధ్య ఉండి, పక్కింటి వారి పేరు కూడా తెలియని దశకు మనం చేరుకున్నాం. ఇంటికి బలమైన తలుపులు, సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్‌లు పెట్టుకున్నాం, కానీ, మన హృదయం మాత్రం క్రమంగా కుచించుకు పోతోంది. ఈ పరిస్థితిలో పొరుగు వారి హక్కులు అనేది నైతిక విలువ మాత్రమే కాదు. ఒక మానవ సమాజం నిలబడటానికి అవసరమైన మూల స్తంభం.

ఈ హక్కులు కూడా మనవే

పొరుగువారితో సంబంధం అంటే నిశ్శబ్దంగా ఉండడం, వారి దారికి ఎలాంటి ఆటంకం కల్పించకుండా ఉండడం వంటి సాధారణ నియమాలు మాత్రమే అని అనుకుంటాం. కానీ, అసలు హక్కులు మరింత విశాలమైనవి, తాత్త్వికమైనవి. పక్కింటి వ్యక్తి బాధలో ఉన్నప్పుడు పరామర్శించడం, ఇంటి ముందు అరుగుపై ఉదాసీనంగా కూర్చుని ఉండే వృద్ధులను పలకరించడం, ఏదైనా ఇంటి తలుపు రెండు రోజులు మూసి ఉంటే ఆరా తీసి బాగున్నారా! అని తెలుసుకోవడం, ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా చూడడం, మన సొంత ఆనందం, మన సొంత గోప్యత, మన సొంత జీవితం నడుమ కొంచెం ప్రేమకు, కొంచెం జాగ్రత్తకు, కొంచెం మనసుకు స్థానం ఇవ్వడం ఇవన్నీ పొరుగువారి హక్కులే. ఈ హక్కులు అన్ని మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలలోనూ ప్రస్తావించబడ్డాయి. చాలా కాలం క్రితం ఇళ్లకు గోడలు ఉండేవి కానీ, హృదయాలకు గోడలు ఉండేవి కాదు. ఒక ఇంట్లో వండిన భోజనం సువాసన పక్కింటి తలుపును దాటి వెళ్లేది, పంచుకునే అలవాటు

ఉండేది. నేడు భద్రత పేరుతో మనం అంతర్జాలంలో ప్రపంచంతో కనెక్టవుతున్నాం కానీ, పక్కింటికి కనెక్టవడాన్ని మాత్రం మర్చిపోతున్నాం. ఈ భేదం సమాజంగా మనం కోల్పోతున్న గొప్ప విలువ. పొరుగువారి ఉనికి మన భద్రతకు, మన మానసిక ప్రశాంతతకు, మన పిల్లల భవిష్యత్తుకు, మన సమాజ స్థిరత్వానికి ఎంత ముఖ్యమో మనం గ్రహించాలి.

పక్కింటి పరదాల వెనుక ఎన్నో కథలు

మనకు తెలియకపోయినా, పక్కింటి పరదాల వెనుక ఎన్నో కథలు ఉంటాయి. ఒంటరితనంతో పోరాడుతున్న వృద్ధులు ఉండొచ్చు. పిల్లలను ఒంటరిగా పెంచుతున్న తల్లి ఉండొచ్చు. ఉద్యోగం కోసం దూర ప్రాంతాల నుండి వచ్చిన యువకులు ఉండొచ్చు. చదువుల ఒత్తిడిలో నిస్పృహతో ఉన్న యువత ఉండొచ్చు. వారికి మనం తప్పనిసరిగా సహాయం చేయాల్సిన పని లేదేమో కానీ, ఒక మంచి మాట, ఒక పలకరింపు, దయనిండిన ఒక చల్లని చూపు వారి ఆలోచనను మార్చగల శక్తి కలిగి ఉంటుంది. ఇది చిన్న విషయం కాదని గ్రహించినపుడు మనిషితనం ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తుంది. పొరుగువారిని నిర్లక్ష్యం చేయడంతో నేటి సమాజం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. అనుమానాలు, అపోహలు, అసహనం పెరుగుతున్నాయి. చిన్న చిన్న విషయాలు పెద్ద గొడవలకు దారి తీస్తున్నాయి. వినడానికి చెవులు లేకపోవడం, మాట్లాడటానికి మనసు లేకపోవడం, ఇవే సమాజాన్ని విభజించే నిజమైన గోడలు. ఈ గోడలు కూలాలంటే ముందు మన మధ్య సత్సంబంధాలు మెరుగుపడాలి. దానికి మనమే ముందడుగు వెయ్యాలి. 'ఎలా ఉన్నారు... బాగున్నారా?' అని అడగడం చిన్న పలకరింపే కానీ, అది నమ్మకానికి, విశ్వాసానికి, పరస్పర గౌరవానికి పునాది వేయగలదు. అది, ఆచరణలో పొరుగువారి హక్కులను పాటించడం అంటే ఇంటిని శుభ్రంగా ఉంచటమే కాదు, మన హృదయం శుభ్రంగా ఉండాలి. పక్కింటి వారికి ఇబ్బంది కలిగించకుండా ఉండటం మాత్రమే కాదు, వారి సుఖంలో సంతోషపడటం, అవసరంలో అడగక ముందే సహాయం చేయడం. ఏ మతం అయినా, ఏ సంస్కృతి అయినా, మానవత్వమే కేంద్రంగా స్పందించే గుణం ఉండాలి. పొరుగువారి కష్టంలో మనం పాలుపంచుకుంటే, వారి భద్రత మన భద్రతగా మారుతుంది. పొరుగిల్లు ప్రశాంతంగా ఉంటే, మన ఇల్లూ ప్రశాంతంగా ఉంటుంది.

బయటి నుండి వచ్చే సహాయం కంటే

ఎవరికైనా అత్యవసర పరిస్థితి వస్తే, బయటి నుండి వచ్చే సహాయం కంటే ముందుగా స్పందించేది పొరుగువారే. ఒక సమాజం బలపడాలంటే అది ముందుగా పొరుగువారి బంధంతోనే బలపడాలి. మనం ఈ బంధాన్ని గౌరవిస్తే, ప్రేమిస్తే, సంరక్షిస్తే, మన వీధులు, మన కాలనీలు, మన సమాజం, మన దేశం, మన పిల్లల భవిష్యత్తు మరింతగానూ సురక్షితంగా మారుతుంది. మనిషితనానికి ప్రమాణం ఎంత ధనవంతుడో, ఎంత చదివాడో, ఏ పొజిషన్‌లో ఉన్నాడో కాదు. పక్కింటివారికి ఎంతగా ఉపయోగపడుతున్నాడు అనేదే ప్రమాణం. ఎందుకంటే మన మంచితనం మనం ఇంటిలో కాదు, పక్కింటి ద్వారానే తెలుస్తుంది. కనుక మన మనసులు పొరుగువారికి దగ్గరగా ఉండాలి. పరస్పర సహకారం, పరస్పర ప్రేమానురాగాల ద్వారానే సత్సమాజ నిర్మాణం సాధ్యం.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

గందరగోళంలో పంచాయతీ ఎన్నికలు

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

తెలంగాణ పంచాయతీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. రిజర్వేషన్ అమలు విధానం, కోర్టుల తీర్పులు, జీఓలు, బీసీల అసంతృప్తి, ఎన్నికల షెడ్యూలు అనుకోని వేళ విడుదల అన్నీ కలిసి సంక్లిష్ట స్థితి సృష్టించాయి. బీసీ రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన శాతం, అమలులో ఉన్న లోపాలు, హైకోర్టు, సుప్రీంకోర్టు ఘటనలు, డెడికేషన్ కమిటీ నివేదిక ఈ ఎన్నికలను కేవలం స్థానిక సంస్థల ఎన్నికలుగా కాకుండా, సామాజిక, రాజకీయ-న్యాయపర ఉద్విగ్న పరీక్షగా మార్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు జీఓ నంబరు 9 విడుదల చేసింది. ఈ జీఓ రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసల కన్నా ప్రశ్నలని ఎక్కువగా తెచ్చి పెట్టింది. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ రిజర్వేషన్ పరిమితిని దాటడానికి ప్రభుత్వం చూపిన ఆధారాలు స్పష్టంగా కనిపించలేదు. ముఖ్యంగా సుప్రీంకోర్టు 2010లో ఇచ్చిన తీర్పు ప్రకారం 'ట్రిపుల్ టెస్ట్' తప్పనిసరి. అంటే ఓబీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనం మీద ప్రత్యేక అధ్యయనం, ఆ అధ్యయనాన్ని అధికారికంగా ప్రకటించడం, దాని ఆధారంగానే ప్రతీ నియోజకవర్గంలో రిజర్వేషన్లను క్రమపద్ధతిలో అమలు చేయడం, వీటిని ప్రభుత్వం పూర్తిగా పాటించలేదనే సందేహాలు మొదటి దశ నుంచే హైకోర్టులో వినిపించాయి.

గణాంకాలు శాస్త్రీయ పద్ధతిలో సేకరించలేదని

ఈ నేపథ్యంలో హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. గణాంకాలు శాస్త్రీయ పద్ధతిలో సేకరించలేదని, ప్రభుత్వం ఆధారపడిన సామాజిక-ఆర్థిక-విద్యా సర్వేను సరిగ్గా నిర్వహించ లేదని, సేకరించిన డేటా బలహీనమని, ఆ డేటాను ప్రజలకు వివరంగా వెల్లడించక పోవడం అనుమానాలను మరింత పెంచిందని వారు వాదించారు. దీంతో హైకోర్టు జీఓ 9 మీద స్టే ఇచ్చి, పంచాయతీ ఎన్నికలు పాత రిజర్వేషన్ విధానం ప్రకారం నిర్వహించాలని ఆదేశించింది. ఈ స్టే నిలిపి వేయాలని ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా హైకోర్టు విచారణలో ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని పేర్కొనడంతో ప్రభుత్వం వెనుదిరగాల్సి వచ్చింది. ఇది 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వ హామీపై ప్రజలలో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసింది. బీసీ రిజర్వేషన్‌ను తిరిగి 23 శాతానికి పరిమితం చేయాల్సి వచ్చింది. గతంలో ఎస్సీలకు కేటాయించిన స్థానాలు రొటేషన్ కారణంగా జనరల్ స్థానాలు కాగా, ఆ స్థానాలలో అధిక సంఖ్యలో ఎస్సీలు ఉన్న కారణంగా వారే గెలిచే అవకాశాలు అనివార్యం. అలాగే జనరల్ స్థానాలలో కూడా అందరూ పోటీ చేసే అవకాశాలు ఉన్నందున ప్రధానంగా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్న మాట వాస్తవం.

తొందరపాటు చర్య



మొత్తంగా చూస్తే రిజర్వేషన్ ఖరారు విధానం పటిష్ఠంగా అమలు కాకపోవడం వల్ల బీసీ వర్గాలకు తీరని నష్టం జరిగింది. వారికి లబ్ధి చేకూరాల్సిన చోట న్యాయపరమైన స్పష్టత లేకపోవడం, రాజకీయ హామీలు అమలులో వెనుకంజ వేయడం, సర్వేలు పూర్తి శాస్త్రీయత లేకపోవడం, ఎన్నికల షెడ్యూలు విడుదల సమయంలో న్యాయపర అయోమయం నెలకొనడం ఈ ఎన్నికలను అత్యంత క్లిష్ట దశకు తీసుకు వచ్చాయి. హైకోర్టు తుది తీర్పు ఏ రూపంలో వచ్చినా భవిష్యత్తులో రిజర్వేషన్ నిర్మాణంపై, గ్రామీణ స్వయం పాలనలో బీసీ వర్గాల ప్రాతినిధ్యంపై, ప్రభుత్వాల నిర్ణయాధికారంపై పూర్తిస్థాయి ప్రభావం చూపడం ఖాయం. ప్రజలు, రాజకీయ పార్టీలు, న్యాయ వర్గాలు హైకోర్టు తీర్పు కోసం అత్యంత ఉత్కంఠతో ఎదురు చూడక తప్పని స్థితిలో, ప్రస్తుత ఎన్నికల నిర్వహణ తొందరపాటు చర్యగా భావిస్తున్నాయి.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

ప్రకృతి వైపరీత్యాల వేళ.. మూగజీవాలకు రక్షణ కల్పిద్దాం

- మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం, సిటీబ్యూరో , నవంబర్ 27: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మూగజీవాలకు రక్షణ కల్పించాల్సినవసరం ఉందని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానలు రూపొందించడానికి సచివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. తర్వాత క్యాబినెట్లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. యూని సెఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మూగజీవాలకు రక్షణ కల్పించడంపై గురువారం జరిగిన సదస్సులో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను పసిగట్టడంలో మనకంటే మూగజీవాలు ముందున్నప్పటికీ.. వాటికి కనీస రక్షణ ఏర్పాట్లు లేక ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో వాటి రక్షణకు స్పష్టమైన విధానాలను రూపొందించాల్సినవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకృతిని వికృతంగా వాడుకుంటున్నందున వైపరీత్యాలు సహజంగా మారాయని మంత్రి చెప్పారు. భారీ వర్షాలు, విపరీతమైన ఎండలకు మనమే తట్టుకోలేకపోతున్నాం.. అలాంటిది మూగ జీవాలు ఎలా అని ఆలోచించడం చాలా మంచి పరిణామం అని అన్నారు. రాష్ట్రంలో గోవుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని.. తెలంగాణ గో సంరక్షణ్ పేరిట విధివిధానాలను రూపొందించామని గుర్తు చేశారు.

మూగజీవాల రక్షణ గురించీ ఆలోచిద్దాం

ప్రకృతివైపరీత్యాలు సంభవించినప్పుడు రిహాబిలిటేషన్ కేంద్రాలను ప్రజలను తరలించడం, వారికి రక్షణ కల్పించడం తరచూ జరుగుతోంది. మూగ జీవాల విషయంలోనూ ఆలోచన చేయాల్సినవసరం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ అన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇప్పటివరకూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల విషయంలోనే ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం జరిగిందన్నారు. మూగజీవాలకు కూడా షెల్టర్ జోన్లను ఏర్పాటు చేసి రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల ఒక్క రోజులోనే 10 సెంటీ మీటర్ల నుంచి 20 సెంటీ మీటర్ల మేర వర్షం పడుతోందని.. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో మూగ జీవాల గురించి ప్రత్యేక చర్యలవసరమన్నారు. వర్షాల గురించి ముందస్తు సమాచార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేయాల్సినవసరం ఉందన్నారు. వరదలను అరికట్టడానికే చెరువుల పరిరక్షణ పెద్దయెత్తున జరుగుతోందదన్నారు. ఆ దిశగా హైడ్రా పని చేస్తోందని.. నగరంలో నాలాల విస్తరణతో ప్యాట్నీ, అమీర్పేట పరిసరాలు మునగకుండా జాగ్రత్త పడ్డామన్నారు. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా వాటిని పరిరక్షిస్తే చాలా వరకు వరదలు నివారించవచ్చునని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ బి. గోపి , కేరళ రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం మెంబర్ సెక్రటరీ డా. సేఖర్ ఎల్ కురాయ్కోస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 27: సీఎం సహాయనిధిని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం గోదుమకుంట గ్రామానికి చెందిన ఊర్మీళ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుంది. ఆర్థిక పరిస్థితి బాగాలేక సీఎం సహాయనిధి కోసం అర్జీ పెట్టుకుంది. ఆమెకు మంజూరైన 60 వేల రూపాయల చెక్కును గురువారం ఊర్మీళకు మల్లారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గోధుమకుంట మాజీ సర్పంచ్ అకిటి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంగేటి మహేందర్ రెడ్డీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 28: రాబోయే పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. నూతనంగా ఎన్నికైన మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్ కు కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో గురువారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పంచాయితీ, ఎంపిటిసీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు ప్రతి కార్యకర్త, నాయకులందరు కృషి చేయాలని తెలిపారు. జూబ్లీహిల్స్ శాసనసభ ఎన్నికలో మేడ్చల్ నుండి వచ్చి నవీన్ యాదవ్ గెలుపుకు కృషి చేసిన ప్రతిఒక్క కాంగ్రెస్ నాయకులకు దాభ్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ చీర్ల రమేష్, అగ్రికల్చర్ డైరెక్టర్ రెగురాజు, నాయకులు మధుకర్ యాదవ్, సీనియర్ నాయకులు సద్ది సంజీవ్ రెడ్డి, ఎస్సి సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, బండి శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, లింగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ యూనివర్సిటీ సౌత్ జోన్ వాలీబాల్ పురుషుల జట్టు ఎంపిక

కూకట్ పల్లి, ప్రతిపక్షం, నవంబర్ 27: జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ లో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పురుషుల జట్టు ఎంపిక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు హాజరై, క్రీడాకారులను అభినందించారు.ఈ ఎంపిక కార్యక్రమాన్ని జేఎన్టీయూహెచ్ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ కళాశాలల నుండి వచ్చిన 120 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. చీఫ్ సెలెక్టర్గా జి వినోద్ కుమార్ వ్యవహరించడం జరిగింది ,ఫిజికల్ డైరెక్టర్లు తోట మోహన్రావు, జన్ను బాబురావుతో పాటు ఇతర కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు కూడా పాల్గొన్నారు.డిసెంబర్ 10 నుండి 14వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్లోని జేఎన్టీయూ కాకినాడలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ ఛాంపియన్షిప్లో ఈ ఎంపిక చేసిన జట్టు పాల్గొనున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ తెలిపారు.

భద్రాద్రి కళ్యాణోత్సవం పోస్టర్ఆవిష్కరణ

- హరిహర ఫౌండేషన్ కార్యక్రమం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 27 : హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భద్రాచలం సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం పోస్టర్ను గాంధీభవన్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాబోయే రోజులలో విశిష్ట ధార్మిక వైభవంతో ఈ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఫౌండేషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం ప్రజలకు ఆధ్యాత్మిక శాంతి, ధార్మిక స్ఫూర్తిని అందించే కార్యక్రమమని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేటిఆర్ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం , ఉప్పల్, నవంబర్ 27 : తన పుట్టిన రోజు సందర్భంగా ఉప్పల్ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటిఆర్ , మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అండర్15 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

- హాజరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటి బ్యూరో , నవంబర్ 27 : జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ మధురనగర్ లోని డీ.సీ.హెచ్.ఎస్.ఎన్ రాజు ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్ 15 బ్యాడ్మింటన్ క్రీడలను ముఖ్యఅతిధిగా హాజరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ఆటలు మానసిక ఉల్లాసానికి.. ఉత్సాహానికి.. మనిషి యొక్క మానసిక స్థితిని పెంపొందించడానికి.. అలాగే చక్కటి దేహ దారుద్యానికి ఆటలు ఉపయోగపడతాయని వీలైనంతవరకు ఆటలకు సమయం కేటాయించి సంపూర్ణ ఆరోగ్యస్తులు గా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ టోర్నమెంట్ను మధుర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్స్ మరియు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పి వెంకటరావు. అరబిందో ఫారామెడికల్ డైరెక్టర్ మదన్మోహన్ రెడ్డి. కాలనీ ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగార్జున రెడ్డి. సోమ పటేల్ .వినయ్ గౌడ్. సురేఖ తదితరులు పాల్గొన్నారు.



మురుగునీటి సమస్యను పరిష్కరించండి

- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అదికారులు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 27 : మొయినాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్, రైతువేధిక, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మురుగునీరు అంతా చేరి కుంటగా మారింది.దీంతో అటుగా వెళ్లే ప్రజలకు దుర్గందపు వాసన వెదజల్లతుంది. తీవ్ర ఇబ్బందులకు ప్రజలకు గురవుతున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నామినేషన్ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 27: నల్గొండ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్ల పట్ల జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలుగా నియమితులైన ఐఏఎస్ అధికారి, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్రా లక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. నార్కెట్ పల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని, చిట్యాల మండలం, వెలిమినేడులో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఆమె జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ పత్రాలు, నామిషన్లు వేసే సందర్భముగా అభ్యర్థులు పాటించవలసిన సూచనలు, ఇతర నియమ నిబంధనల పత్రాలు, నామినేషన్ పత్రంతోపాటు సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలు పరిశీలించడమే కాకుండా హెల్ప్ డెస్క్ లోని సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ల స్వీకరించే గదులను, మెటీరియల్ ను, ఇతర ఏర్పాట్లను పరిశీలించి నామినేషన్ల స్వీకరణ సందర్భంగా అనుసరిస్తున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. వారితో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవో అశోక్ రెడ్డి, డీపీవో వెంకయ్య, ఆయా మండల స్థాయి అధికారులు ఉన్నారు.



టీఎస్ యూటీఎఫ్ చిట్యాల మండల కమిటీ ఎన్నిక

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 27 : టీఎస్ యూటీఎఫ్ చిట్యాల మండల శాఖ అధ్యక్షులుగా ఏశమల్ల నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా గడగోజు సతీష్, ఉపాధ్యక్షులుగా రంగా రామలింగయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా ఎం జానకి, కోశాధికారిగా తోట చంద్రశేఖర్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కమిటీ సభ్యులు నర్రా సరళ, సీనియర్లు శంభయ్య, శ్రీనివాస్, జ్యోతి , రామోహన్, చంద్ర శేఖర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన మండల మహాసభ అనంతరం వీరి ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాల వెంకటేశం, ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.

నల్లచెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించలేదు

- స్వయంగా ఖాళీ చేసి వెళ్లిన చెత్త సేకరణదారులు
- 180 సర్వే నంబరుతో 176లో కబ్జాకు ప్రయత్నాలు

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 27: కూకట్పల్లి నల్లచెరువు చెంత ఎలాంటి ఆక్రమణలను బుధవారం హైడ్రా తొలగించలేదు. చెరువు ఫుల్ ట్యాంక్ పరిధిలోకి వచ్చిన సర్వే నంబరు 176లో ఉన్న తాత్కాలిక షెడ్డులను హైడ్రా ఇప్పటికే ఖాళీ చేయించింది. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించిన ఆటోవాలాలు, స్క్రాప్ను వేరు చేసి అమ్ముకునేవారు తాత్కాలికంగా ప్లాస్టిక్ కవర్లతో వేసిన షెడ్డులను హైడ్రా ఇప్పటికే తొలగించింది. చెరువు పరిధిలోకి వస్తున్నారు.. ఖాళీ చేయాలని వారిని కోరగానే.. అక్కడివారు సమ్మతించి వెళ్లిపోయారు. ఇదంతా కూకట్పల్లి నల్లచెరువు ఫుల్ ట్యాంకు పరిధిలోకి వచ్చే సర్వే నంబరు 176 వ్యవహారం. చెత్తను సేకరించినవారితో పాటు.. స్క్రాప్ అమ్ముకునే వారి నుంచి అద్దెలు కూడా తీసుకుని.. వారిని అడ్డం పెట్టుకుని ఆ స్థలాన్ని కొట్టేయాలనుకునేవారు సర్వే నంబరు 180తో ఇప్పుడు అక్కడ పేదల గుడిసెలు అని హైడ్రామా సృష్టిస్తున్నారు. అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకున్న వారు స్వయంగా ఖాళీ చేసుకుని వెళ్లిపోగా.. కొంతమందితో కలిసి కబ్జాదారులు చివరి ప్రయత్నం చేస్తున్నారు. 180సర్వే నంబరుతో నష్టపరిహారం కావాలని కూడా కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైడ్రా ఖాళీ చేయిస్తున్నది 176 సర్వే నంబరులో అని కోర్టుకు వివరించిది కూడా. అలాగే చెత్తను చెరువు పరిధిలోకి తీసుకువచ్చి.. జలాలను కాలుష్యం చేస్తున్న విషయం కూడా కోర్టు దృష్టికి హైడ్రా తీసుకెళ్లింది. సర్వే నంబరు సరి చూసుకుని వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని హైకోర్టు సూచించడంతో.. రెండు మూడు రోజుల క్రితం అక్కడ చెత్తను సేకరించేవారు స్వయంగా ఖాళీ చేసి వెళ్లి పోయారు. వారి బదులు.. అక్కడ స్థలాన్ని కొట్టేయాలని చూసే కబ్జాదారుల ప్రయత్నం ఈ గందరగోళం అని హైడ్రా స్పష్టం చేసింది.

“

బీసీ విద్యార్థులకు డిసెంబర్ 14 నుంచి ఉచిత సివిల్స్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్ అందించనున్నాం. వంద మందికి శిక్షణిచ్చేలా బీసీ భవన్లో ఏర్పాట్లు చేస్తున్నాం. వైట్ రేషన్ కార్డున్నవారు అర్హులు. డిసెంబర్3 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. 7న అర్హత పరీక్ష, 11న ఫలితాలు వెల్లడిస్తాం. 100 సీట్లలో బీసీలకు 66, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 సీట్లు కేటాయిస్తున్నాం. మహిళలకు 34% రిజర్వేషన్లు అమలుచేస్తాం.

- ఏపీ మంత్రి సవిత

ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 27: కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దని అధికారులు నిర్వాహకులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఎన్ని క్వింటాలో దాన్యం ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుంది, ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు, ఈరోజు ఎంత ధాన్యాన్ని కాంటాలు వేశారు, ఎన్ని టోకెన్లు ఇచ్చారు, రోజుకు మిల్లులకు ఎంత ధాన్యం వెళ్తుంది, రైతుల వివరాలను ట్యాబ్ లో ఎందుకు నమోదు చేయడం లేదని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల కోసం టెంట్, తాగునీరు సదుపాయాలు కల్పించాలి కదా ఎందుకు కలిపించలేదని నిర్వాహకులను కలెక్టర్ ప్రశ్నించారు. ఆరు రోజుల నుండి ట్యాబ్ పనిచేయకపోతే ఎందుకు బాగు చేయించలేదని కలెక్టర్ అడిగారు. రైతులకు డబ్బులు ఖాతాలో పడాలంటే ట్యాబ్ ఎంట్రీ చేయాలి. ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇన్ని రోజుల నుండి ట్యాబ్ ఎంట్రీ చేయకపోతే రైతులు ఎందుకు అడగడం లేదని అక్కడే ఉన్న పలువురు రైతులను కలెక్టర్ అడిగారు. అక్కడే ఉన్న రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, ట్యాబ్ ఎంట్రీ చేయడంలో జరిగిన నిర్లక్ష్యంపై ఏపీఎం, కొనుగోలు కేంద్రం ఇన్చార్జికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రైతుల వివరాలను నమోదు చేసే ట్యాబ్ ను వెంటనే బాగు చేయించుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే ఎంట్రీ చేయాలని పేర్కొన్నారు. దాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరిగే విధంగా ఎంపీడీవో, ఏపీఎం కొనుగోలు చేసిన వద్ద ఉండి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టెంటు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్థానిక తహసిల్దార్ ప్రవీన్ కుమార్, ఎంపీడీవో ఫణి చంద్ర, ఏపీఎం వేణు, తదితరులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- మూడు దశలలో ఎన్నికల నిర్వహణ
- తొలివిడతకు నామినేషన్ల స్వీకరణ షురూ
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

ప్రతిపక్షం, హన్మకొండ, నవంబర్ 27: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, మూడు దశలలో ఎన్నికల నిర్వహణ జరుగుతుందని, తొలివిడత కోసం గురువారం నుంచి నామినేషన్ లను స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు మూడు దశలలో నిర్వహించడం జరుగుతుందని మొదటి విడతలో భీమాదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మూడు మండలాలలోని 69 గ్రామపంచాయతీలకు 658 వార్డు లకు ఈ నెల 27 తేదీ నుండి నామినేషన్ ల స్వీకరిస్తున్నట్లు , తేదీ.11.12.2025 గురువారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. రెండవ దశ పోలింగ్ ధర్మసాగర్, హసన్పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మొత్తం ఐదు మండలాలలోని 73 గ్రామ పంచాయతీలకు , 694 వార్డ్ లకు, తేదీ.30.11.2025 ఆదివారం నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని , తేదీ.14.12.2025 ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. మూడవ దశలో ఆత్మకూరు, దామెరా,నడికూడ, శాయంపేట్ నాలుగు మండలాలలోని 68 గ్రామపంచాయతీలకు , 634 వార్డ్ లకు తేదీ.03.12.2025 బుధవారం రోజున నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని తేదీ.17.12.2025 బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో పోలింగ్ జరిగే 658 పోలింగ్ స్టేషన్ల లో సమస్యాత్మకమైన 14 గ్రామ పంచాయతీ ల్లోని 166 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్నున్నట్లు, అదేవిధంగా రెండవ విడతలో 18 గ్రామ పంచాయతీల్లోని 208 పోలింగ్ కేంద్రాలలో, మూడవ విడతలో 20 గ్రామ పంచాయతీల్లోని, 212 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ తో పాటు 66 మంది మైక్రో అబ్జార్వర్లను నియమించామని తెలిపారు. అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ లో ఎన్నికల సహాయక కేంద్రం 24 గంటల పాటు పనిచేస్తుందని, ఎన్నికలకు సంబంధించి సందేహాలు, ఫిర్యాదుల కోసం సహాయక కేంద్రం ఫోన్ నెంబర్ 7981975495 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల కు సంబంధించి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ ల స్వీకరణ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలు అయిన ఎల్కతుర్తి, దామెర, గోపాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో క్లస్టర్ల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు.

మొదటి దశ నామినేషన్ల పర్వం షురూ

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 27: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు 4 మండలాల్లోని గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లోని 82 గ్రామ పంచాయతిలకు 45, 712 వార్డులకు 35 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. మొదటి విడతలో 4 మండలాల్లోని 82 గ్రామ పంచాయతీల పరిధిలోని 712 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణను ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారులు, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టీ, ఎంసిసి టీములు పటిష్ట పర్యవేక్షణ చేయాలని, ఎన్నికలు నిర్వహణలో ప్రజలు యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఏదేని ఫిర్యాదులు కు 24 గంటలు పని చేయు విధంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.

జిల్లాకు సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 27 : జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణను నిస్పాక్షికంగా, పారదర్శకంగా, శాంతియుతంగా జరపడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇద్దరు అధికారులను పరిశీలకులుగా నియమించింది. జిల్లాకు పంచాయితీ ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి పి. ఉదయ్ కుమార్ ను, వ్యయ పరిశీలకులుగా జిల్లా ఆడిట్ ఆఫీసర్ జి. రాకేష్ లను నియమించింది. ఎన్నికల ప్రక్రియలో సాధారణ పర్యవేక్షణ, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలకులు పర్యవేక్షిస్తారు. ఎన్నికల పరిశీలకులు ఇద్దరూ జిల్లాకు విచ్చేసారు. గురువారం సాధారణ పరిశీలకులు పి. ఉదయ్ కుమార్, ఐఏఎస్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి కంది మండలం కవలంపేట గ్రామంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను, నామినేషన్లను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని వారు సూచించారు. కలెక్టర్ తో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ ఓ సుధీర్, తదితరులు ఉన్నారు. వ్యయ పరిశీలకులు జి.రాకేష్ సంబంధిత అధికారులతో సమావేశమై ఎన్నికలలో అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా పై నిఘా ఉంచాలన్నారు. నిబంధనల మేరకు పారదర్శకంగా నడుచుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేస్తాం

- ఇల్లందు డి ఎస్పీ చంద్రబాను

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 27: సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేస్తామని ఇల్లందు డి ఎస్పీ.చంద్రభాను తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, నియమనిబంధనల ప్రకారం ప్రజాస్వామ్యం పండుగలా ఎన్నికలు జరగడానికి పోలీసు విభాగం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. మండల ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని డి ఎస్పీ కోరారు. అనుమానాస్పద కదలికల పై పోలీసు విభాగం నిఘా మరింత పెంచినట్లు తెలిపారు. చట్ట ఉల్లంఘన కనిపించిన వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల కాలంలో అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, నగదు, మద్యం, బహుమతుల పంపిణీ వంటి చట్టవిరుద్ధ చర్యలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అక్రమ మద్యం, నాటు సారా, విలువైన ఆభరణాలు, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అడ్డుకోవడానికి ఉమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కేసుల్లో ఉన్న నేరస్థులను ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియా పై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని, తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు, ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సంబంధిత వ్యక్తులతో పాటు వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌లపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని ఉల్లంఘించడం భవిష్యత్తులో సమస్యలకు దారితీస్తుందని గుర్తుచేసిన డి ఎస్పీ ప్రజల శాంతి భద్రతకు భంగం కలిగించకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ తో పాటు గుండాల సి.ఐ. ఎల్. రవీందర్, ఎస్.ఐ. సైదా రవూఫ్ పాల్గొన్నారు.

ఖోఖో క్రీడల సంబరానికి సిద్ధమైన పటాన్ చెరు మైదానం

- నేటి నుండి పటాన్ చెరు లో 44వ తెలంగాణ అండర్ 14 కోకో బాలబాలికల అంతర్ జిల్లాల ఛాంపియన్ షిప్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడల నిర్వహణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 27 : రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్చెరు పట్టణం మరోసారి వేదికగా నిలవనుంది. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా నేటి నుండి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు 44వ తెలంగాణ అండర్ 14 ఖోఖో బాల-బాలికల అంతర్ జిల్లాల చాంపియన్షిప్-2025 పోటీలు జరగనున్నాయి. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సౌజన్యంతో ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు గురువారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మైత్రి మైదానంలో క్రీడల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. 33 జిల్లాల నుండి తరలివచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి సదుపాయం తోపాటు అల్పాహారం, భోజనం సదుపాయాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఏడాది పొడుపున వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ పోటీలకు పటాన్చెరు మైత్రి మైదానాని వేదికగా నిలుపుతున్నామని తెలిపారు. కోకో క్రీడకు మరింత ప్రాచుర్యం అందించేలా రాష్ట్రస్థాయి పోటీలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోకో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు హరి కిషన్, కార్యదర్శి శ్రీకాంత్, సిఐ వినాయక రెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిస్లెరి ఇంటర్నేషనల్ పరిశ్రమ యాజమాన్యం మొండి వైఖరి విడనాడి, తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ (సిఐటియు) కన్వీనర్, యూనియన్ అధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈరోజు ఐడిఏ పాశమైలారం లోని బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమ వద్ద కార్మికులు చెట్ల ఆకులు తింటూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు.

ప్రతిపక్షం, సంగారెడ్డి

పదవ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- చేర్యాల జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 27 : కంది మండలం, చేర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో జరుగుతున్న బోధనా పద్ధతులను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులను సిలబస్ ఎంతవరకు పూర్తయింది, రెగ్యులర్, ప్రత్యేక తరగతులు ఎలా జరుగుతున్నాయి. అన్నవిషయాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు బాగా నిర్వహిస్తున్నారని, చక్కగా చదువుకుంటున్నట్లు విద్యార్థులు కలెక్టర్కు తెలిపారు . విద్యార్థులందరికీ ప్రతిరోజూ స్నాక్స్ అందుతున్నాయా, మిడ్‌డే మీల్ నాణ్యత ఎలా ఉంది, అనే విషయాలపై ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరాతీసారు. పాఠశాల హాజరు శాతం, పదవ తరగతి విద్యార్థుల ప్రిపరేషన్, మాక్ టెస్టులు ఎంతవరకు నిర్వహిస్తున్నారన్న అంశాలను ప్రత్యేకంగా సమీక్షించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మరింత క్రమశిక్షణతో చదువుకోవాలని కలెక్టర్ సూచించారు . ఈసారి మంచి మార్కులు సాధించి పాఠశాల పేరును ,జిల్లా పేరును ఉన్నతంగా నిలబెట్టాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై మరింత ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన అకాడమిక్ సపోర్ట్ అందించాలని సూచించారు . కలెక్టర్ వెంట విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

- మొదటిదశ నామినేషన్ల పర్వాన్ని పర్యవేక్షించిన ఎస్పీ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 27 : మొదటి దశ స్థానిక ఎన్నికలకు నామినేషన్స్ ప్రారంభమైన వేల, జిల్లాలోని వివిధ మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ, అక్కడి బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ శాంతియుతంగా జరుగేలా చూడాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నామినేషన్స్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మార్క్ చేసి, ఎవ్వరిని లోపలికి అనుమతించకూడదని, నామినేషన్స్ సమర్పించే అభ్యర్థులను ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతించాలని అన్నారు. అభ్యర్థి వెంబడి ముగ్గురు వ్యక్తులను మాత్రమే అనుమతించాలని అధికారులకు సూచించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం, క్రికెట్ కిట్స్ వంటివి పంపిణీ చేసి, ఓటర్లను మబ్బుపెట్టిన, ప్రలోభాలకు గురిచేసినట్లు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రశాంత వాతావరణాన్ని ప్రభావితం చేసే విధంగా ఇతర వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలు చేసిన, ఫార్వార్డ్ మెసేజ్ చేసినా, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించినా ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కేవలం 17 శాతమే ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసింది. రిజర్వేషన్ల విషయంలో బీసీలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. సీఎం రేవంత్ రాజకీయ నాయకుడిలా కాకుండా రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారు. హిల్ట్ పాలసీ పేరుతో 9,300 ఎకరాల పారిశ్రామిక భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోంది.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రాంతీయం

పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం
- నియమ, నిబంధనలపై సూచనలు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 27: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఐడీఓసీ మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 508 గ్రామపంచాయితీలు, 4,508 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. నామినేషన్లు దాఖలుకు పోటీదారునితో పాటు మరో ఇద్దరిని మొత్తం ముగ్గురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారని, ఒకరు ఒక దానికి మాత్రమే పోటీ చేయాలని, ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థి అ పంచాయితీలో, వార్డు మెంబెర్ అ పంచాయితీలోని వార్డు ఓటరు జాబితాలో పేర్లు నమోదై ఉండాలని, అలాగే పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు ఉండరాదని, పోటీదారు నామినేషన్ పత్రాలతో పాటు ఫోటో, క్యాస్ట్, బర్త్ సర్టిఫికేట్ మరియు ప్రత్యేకంగ బ్యాంక్ ఖాతా తెరవాలని సూచించారు. నామినేషన్ స్వీకరించిన చివరి రోజు మరుసటి రోజు పరిశీలన, అదేరోజు చెల్లుబాటైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని, ఆ మరుసటి రెండు రోజులలో అప్పీళ్లను స్వీకరించి , ఆ తరువాత రోజు ఉప సంహరణ మరియు అదే రోజు పోటీచేయు అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కొరకు ఇప్పటికే జిల్లాలో అక్కరుపెట్ భూంపల్లి, ముస్త్యాల, తోటపల్లి, జెల్లేలగడ్డ, వంటిమామిడి (జిల్లా బార్డర్ల వద్ద) ఎస్ఎస్టీ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యునానిమస్ అయిన అభ్యర్థుల వివరాలను ఎన్నికల పరిశీలకులు నిర్ధారించిన తరువాతే ప్రకటించడం జరుగుతుందని, నామినేషన్ వేసే ప్రతి చోట హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓటరు లిస్ట్ వివరాలను జడ్పీ, ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సీపీఓ దశరథ్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ పరిశీలించిన అధికారులు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 27: సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 నేపథ్యంలో మొదటి విడత నామినేషన్ ప్రక్రియ జిల్లాలో వేగంగా జరుగుతోంది. గజ్వేల్, జగదేవ్ పూర్, ములుగు మండలాల్లోని పలు క్లస్టర్లలో జరుగుతున్న నామినేషన్ స్వీకరణ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కె. హరిత క్షేత్రస్థాయిలో ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు గజ్వేల్ మండలంలోని అక్కారం క్లస్టర్‌కు చెందిన అక్కారం, శ్రీగిరిపల్లి, ధాతర్పల్లి గ్రామాల నామినేషన్ స్వీకరణ పై అధికారులకు కలెక్టర్ సూచనలు ఇచ్చారు. ఇదేవిధంగా జగదేవ్ పూర్ క్లస్టర్ పరిధిలోని జగదేవ్ పూర్, పిర్లపల్లి, ధర్మారం గ్రామాలలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అదే మండలంలోని గొల్లపల్లి క్లస్టర్‌లో కొండాపూర్, దౌలాపూర్ గ్రామాల నామినేషన్ల స్వీకరణ తోపాటు ప్రతి కేంద్రంలో సౌకర్యాలు సమృద్ధిగా ఉన్నాయో లేదో పరిశీలించిన వారు ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు కోసం పోలీసులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నామినేషన్లు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపిడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

టీఎన్జీవోల ఆధ్వర్యంలో కలెక్టర్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 27:- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జన్మదిన వేడుకలు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్ ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ను సన్మానించి కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని ఉద్యోగులు విధినిర్వహణలో సమర్థవంతంగా పని చేస్తున్నారని మరింత పారదర్శకత పెరిగే విధంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, జిల్లాను వేగవంతంగా అభివృద్ధి చేసే విధంగా తోడ్పాటు ఇవ్వాలని ఉద్యోగులకు సూచించారు. ఈ వేడుకలలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ జిల్లా సహాధ్యక్షులు ఎండి ఇక్బల్ పాషా, కోశాధికారి ఎం చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి పోతురాజు శంకర్, మెదక్ యూనిట్ అధ్యక్షులు ఆరేళ్ల రామా గౌడ్, నాయకులు సంతోష్, శ్రీకాంత్, సత్యనారాయణ, సలీం, రిజ్వానలి, శివరాం, హారిక, రామకృష్ణ తదితర ఉద్యోగులు ఉన్నారు.

మొదటి రోజు 55 నామినేషన్లు

- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 27: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా 55 సర్పంచ్లు,వార్డు సభ్యులు 4 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. ఆరు మండలాల్లోని అల్లదుర్గ్ లో 6 సర్పంచ్, రేగోడు మండలంలో 7 సర్పంచ్, శంకరంపేట (ఏ) 8 సర్పంచ్, టేక్మాల్ 5 సర్పంచ్ , 1 వార్డు సభ్యులు, పాపన్నపేట 13 సర్పంచ్, హవేలీ ఘనపూర్ 16 సర్పంచ్, 3 వార్డు సభ్యులకు నామినేషన్లు దాకలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులకు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము 9391942254 నంబర్ కు కాల్ చెయ్యాలని కలెక్టర్ తెలిపారు.

వైభవంగా కాలభైరవుడి ఆలయంలో బోనాలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్ నవంబర్ 27: మెదక్ మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని శ్రీకాలభైరవ స్వామి 15వ ఆలయ వార్షికోత్స వంలో భాగంగా రెండవ రోజు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు తాళ్లపల్లి రాజశేఖర్ అధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూలకాలు, అభిషేకాలు, హోమలు నిర్వహించారు. సాయంత స్వామి వారికి బోనాలను వైభంగా సమర్పించారు. మహిళాలు పలు రకాల బోనాలు అలంకరించి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకవచ్చారు. అన్ని వర్గల ప్రజలు సుఖసంతోషలతో జీవించాలని భక్తులు వేడుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతం భక్తులతో కిటకిటాలాడింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువుల సుందరీకరణ

- రూ.6.34 కోట్లతో అభివృద్ధి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్ధిపేట, నవంబర్ 27: సిద్దిపేట పట్టణంలోని ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువులను సుందరంగా తీర్చిదిద్ది స్వచ్ఛమైన, శుద్ధమైన నీరు నిలిచేవిధంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులతో కలసి ఎర్ర చెరువు, నర్సాపూర్ ఊర చెరువులను గురువారం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. అభివృద్ధి, సుందరీకరణ కోసం నర్సపూర్ చెరువుకు రూ.3.20 కోట్లు, ఎర్ర చెరువుకు రూ.3.14 కలిపి రూ.6.34 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చెరువుల్లోకి మురికి చేరకుండా స్వచ్ఛమైన నీటితో కళకళ లాడే విధంగా చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. ఎర్ర చెరువులోకి మురికి నీరు చేరకుండా చెరువు పక్క నుండి తూములోకి మురికి నీరు వెళ్లే విధంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని,ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. మురికి నీరు చేరడం, గుర్రపు డెక్క మొలవడం కారణంగా దోమలు పెరిగి మహిళలు బతుకమ్మ పండగ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నర్సపూర్ చెరువులో పూర్తిగా మురికి నీరు చేరడంతో ఆ ప్రాంతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్టీపీ ప్రాంతం నుండి చెరువు కిందకు మురికి నీటి డ్రైనేజీ నిర్మించాలని చెప్పారు. తీవ్ర వర్షాలతో వరద ప్రాంతాల నుండి వరద నీరు చెరువులో చేరి కలుషితంగా మారుతోందని తెలిపారు. వరద నీటిని డ్రైనేజీ ద్వారా వెళ్లే విధంగా చూడాలన్నారు.

చేగుంట జడ్పీహెచ్ఎస్ లో రాజ్యాంగ దినోత్సవం

- హాజరైన జిల్లా విద్యాధికారి విజయ

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 27: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్ రూపొందించిన రాజ్యాంగ ప్రముఖుల ఫోటో ఎగ్జిబిషన్ ను జిల్లా విద్యాధికారి తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరజ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ఉపాధ్యాయ నాయకులు చల్లా లక్ష్మణ్, రావుల వెంకటేష్, గర్దాస్ మనోహర్ రావు, రమేష్, సత్యనారాయణ, సుధాకర్, శారద, శ్రీవాణి, ఉమామహేశ్వరి, రాధ, రమాదేవి, రేఖ, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా విద్యాధికారి విజయను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

హరీష్‌ను కలిసిన ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

- అభినందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 27: శివాజీ నగర్ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షులు కాచం కాశీనాథ్, ప్రధాన కార్యదర్శి తడకమడ్ల జనార్ధన్, కోశాధికారి మద్ది శంకర్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. హరీష్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందిస్తూ, వారికి సన్మానం చేశారు. అధ్యక్షులు కాశీనాథ్ మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి కార్యవర్గంతో కలిసి కృషి చేస్తామని, హరీష్ రావు ఆత్మీయ సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బెజుగామ వినయ్, గరిపల్లి శ్రీనివాస్, మురంశెట్టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అందె శ్రీ కి ఉద్యమ నిరుద్యోగ కళాకారుల నివాళులు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 27: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా కవి, లోకకవి, కీర్తిశేషులు అందె శ్రీ కి ఘన సంతాప సభ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ వేళ ఏ బహిరంగ సభ జరిగినా, ప్రజా పోరాటం జరిగినా, అందె శ్రీ ఉద్యమగీతం వినిపించకుండా ఏ కార్యక్రమం జరిగింది లేదని జిల్లా అధ్యక్షులు పిన్నింటి దాసు ఈ సందర్భంగా తెలిపారు. సభ మొత్తం అందె శ్రీ భావోద్వేగ భరిత పాటలతో సాగింది. “మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు”, “కొమ్మ చెక్కితే బొమ్మరా, కొలసి మొక్కితే అమ్మరా”, “చూడ చక్కని తల్లి” వంటి హృదయాన్ని హత్తుకునే గీతాలుతో కళాకారులు ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సభకు అతిథులుగా కళాంజలి రాజేశ్, ఎస్ఎస్సీ బాలు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎర్రవెల్లి శీను, భుజంగం, పరమేష్, శ్రీనివాస్ యాదవ్తో పాటు జిల్లా నాయకులు రామ్ సాగర్, లక్ష్మణ్, సోము నరేష్, రాజు, విధమౌళి, మురళి, ఉదయ్, రేణుక, శృతి తదితర కళాకారులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ

- అబద్ధాలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- మాజీ మంత్రి, సిద్దిపేట హరీశ్ రావు
- దీక్షా దివస్ సన్నాహక సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 27: నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో మలుపు తిప్పిన రోజని, కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 ఉండేది కాదన్నారు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 లేదని, తెలంగాణ వచ్చినందుకే సిద్ధిపేట జిల్లా ఏర్పడిందని చెప్పారు. సిద్ధిపేటకు గోదావరి జలాలు, రైలు, వైద్య కళాశాల, ఇవన్నీ తెలంగాణ రాష్ట్ర ఫలితాలే” అని హరీశ్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం 1531 రోజులు నిరంతరం కొనసాగిందని చెప్పారు. వేలాది మంది ఉద్యమ కారులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారని తెలిపారు. దీక్షా శిబిరానికి గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను మోడల్ బస్టాండ్ నిర్మాణం సమయంలో తొలగించాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తగా పైలాన్‌ను ప్రతిష్టిస్తామని తెలిపారు. ఈ నెల 29వ తేదీన ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలువేసి దీక్షా దివస్ కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. కోటిలింగాల దేవాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి, ముస్తాబాద్ చౌరస్తాలో జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించి, క్యాంపు ఆఫీస్ వద్ద పైలాన్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఉద్యమ ఫోటో గ్యాలరీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అరుదైన ఉద్యమ ఫోటోలు ఉన్నవారు అందజేయాలని కోరారు. దీక్షా దివస్ సందర్భంగా అమరుల కుటుంబాలను గౌరవిస్తామని తెలిపారు. మండలాల వారీగా ఉన్న అమరుల కుటుంబాలను దీక్షా దివస్ సభకు తీసుకురావాలని ఆయన చెప్పారు.

మాయ మాటలు అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తెలంగాణను ఎప్పుడూ మోసం చేయడు హరీశ్ రావు అన్నారు. అబద్ధాలు, మాయ మాటలతో రాష్ట్ర ప్రజలను నమ్మించి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను తప్పుబట్టారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు స్వెటర్ల పంపిణీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 27: మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి స్వెటర్లు పంపిణీ చేశారు.ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతు.. చలి కాలం దృష్ట్యా పిల్లలకు స్వెటర్లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని, భవిష్యత్తులో ఎదగాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. పదో తరగతి పరీక్షలు దగ్గరలో ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వార్డెన్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డెన్ మహేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అనుసరించి 50% రిజర్వేషన్ పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చింది. కొన్ని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువగా ఉండటంతో బీసీ రిజర్వేషన్లలో కొంత మార్పు జరిగింది. ఎక్కడా బీసీల రిజర్వేషన్లు తగ్గించలేదు. సర్పంచుల రిజర్వేషన్లకు మండలాన్ని, వార్డు సభ్యులకు గ్రామాన్ని, జడ్పీటీసీలకు జిల్లాను, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకున్నాం.
- రాష్ట్ర మంత్రి సీతక్క

ప్రాంతీయం

గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగాలి

- జిల్లా సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 26 :- గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తో పని చేయాలని మెదక్ జిల్లా సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ అధికారులకు సూచించారు. గురువారం హవేలీ, ఘనపూర్, పాపన్నపేట మండలాలకు సంబంధించి నామినేషన్ల కు సంబంధించిన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియ జేయాలని ఆమె సూచించారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు. వ్యయ పరిశీలకులు బలరాం మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు వ్యయం వివరాలు సమర్పించని ఎడల గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆయన తెలిపారు. నామినేషన్ల కేంద్రాల పరిశీలనలో జిల్లాఅదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, అడిషనల్ ఎస్పీ మహేందర్ కలిసి.తహసిల్దార్ సింధు రేణుక, ఎంపిడిఓ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

తొలి విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 27: కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా, మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా జరిగేలా ఏర్పాట్లలో అధికార యంత్రంగం నిమగ్నమైంది. మొదటి విడతలో చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ (05) మండలాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది. దీనికోసం జిల్లావ్యాప్తంగా 33 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు పలు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి సీపీ గురువారం నాడు సందర్శించారు. ఎన్నికలు సజావుగా సాగేలా ఈ కేంద్రాల వద్ద పోలింగ్ రోజు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఇందులో

భాగంగా, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల రాజ్యాంగ దినోత్సవ అవగాహన ర్యాలీ

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 27: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పట్టణంలోని పురవీధుల గుండా ప్రజలకు అవగాహన కలిగించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డి. రాము మాట్లాడుతూ భారత రాజ్యంగం గొప్పతనాన్ని వివరిస్తూ మన రాజ్యాంగం ప్రపంచంలో చాలాగొప్పదని, అత్యంత ప్రతిభావంతంగా కాలనుగుణంగా, మార్పులు చేసుకునేవిధంగా ఉన్నదని, అలాగే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతీ భారతీయుడు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సౌభ్రాతృత్వం, ధర్మం, న్యాయం, హక్కులు విధుల పట్ల అవగాహన కలిగిఉండాలని, మంచి స్వేచ్ఛను కలిగిఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం మధుసూదన్ రెడ్డి, కోఆర్డినేటర్ రాంబాబు, డీన్ విజయ్, ప్రైమరీ ఇన్చార్జీలు మమత, లహరిక, ఉపాధ్యాయ బృందం, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలి

- సిద్దిపేట డీడబ్ల్యువో, సీడీపీవో శారద

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 27: అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు పిల్లల తల్లులతో పాటు ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని సిద్దిపేట డీడబ్ల్యువో, సీడీపీవో శారద తెలిపారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో బుధవారం రాత్రి మన ఊరు మన అంగన్వాడీ కళాజాత కళాకారులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ సేవలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అంగన్వాడి టీచర్ తోట పద్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీడబ్ల్యువో, సీడీపీవో శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళా బృందం సభ్యులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంగన్వాడీలో గర్భిణీ నమోదు నుంచి వాళ్లకు ఇచ్చే ఒకపూట భోజనం, గుడ్డు, పాలు అందిస్తున్నట్లు కళా ప్రదర్శనల ద్వారా వివరించారు. ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల వయసు పిల్లలకు ఇచ్చే బాలా, 16 కోడి గుడ్లు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అంగన్వాడీలకు వచ్చే ఐదు సంత్సరాల లోపు వచ్చే పిల్లలకు ఒకపూట భోజనం ఇస్తున్నట్లు కళా ప్రదర్శన ద్వారా తెలిపారు. తల్లులకు ఇచ్చే సలహాలు, సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు భాస్కర్, రాజలింగం, లింగం, శిరీష, పోషణ అభియాన్ ప్రతినిధి శ్రీనివాస్, నవత, సుప్రజ, అంగన్వాడీ నంగునూరు పర్యవేక్షకురాలు,రజిత, అంగన్వాడీ టీచర్లు ఇందిర, ఎస్.లక్మి, ఎం.లక్మి, చంద్రకళ లింగమ్మ, పద్మ, రేణుక, నిర్మల, ఉత్తర, పద్మ, విమల, రాజమల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

చామనపల్లి బీజేపీ సర్పంచ్ అభ్యర్థిగా కుమార్ నామినేషన్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 27: కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామ బీజేపీ సర్పంచ్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర నాయకులు మునిగంటి కుమార్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ రూరల్ బీజేపీ మండల నాయకులు, జిల్లా నాయకులతో కలసి కరీంనగర్ రూరల్ ఎన్నికల కార్యాలయంలో మునిగంటి కుమార్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా మునిగంటి కుమార్ మాట్లాడుతూ చామనపల్లి గ్రామ అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు కొనసాగుతున్నారన్నారు. సర్పంచిగా తనకు అవకాశం కల్పిస్తే చామనపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం శాయ శక్తుల కృషి చేస్తానని మునిగంటి కుమార్ ఈ సందర్భంగా చెప్పారు.

కోహెడ గ్రంథాలయాన్ని పరిశీలించిన 'కేడం'

ప్రతిపక్షం, కోహెడ, నవంబర్ 27: కోహెడ మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి గురువారం పరిశీలించారు. ఆయనతో పాటు కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద ధర్మన్న, బందెల బాలకిషన్, గంపల శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది, కోహెడ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని, పోటీ పరీక్షలకు, జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఆంగ్ల భాష నేర్చుకుంటే ప్రపంచాన్ని చుట్టి రావచ్చు

- నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 27: ఆంగ్ల భాషను నేర్చుకున్న వ్యక్తి ప్రపంచం చుట్టి రావడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్టీఏ) నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జూనియర్ (6,7,8 తరగతులు), సీనియర్ (9,10 తరగతులు) విద్యార్థులకు మండల స్థాయి తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ ఎడిక్వెస్ట్ టాక్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈఎల్టీఏ నంగునూరు మండల అధ్యక్షుడు జి. కన్యాలాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి, మగ్దుంపూర్, గట్లమల్యాల పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దాసరి సుధాకర్, రమేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషతో పాటు ఆంగ్లం నేర్చుకోవాలని సూచించారు. నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి మాట్లాడుతూ ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం దాసరి సుధాకర్, గట్ల మల్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్, ఆంగ్ల ఉపాధ్యాయులు వి.ప్రభాకర్ రెడ్డి, భూపతిరెడ్డి, అశ్రఫ్, వనిత, సుశీల, హమీదా బేగం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పై నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- అన్నం నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 27: పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు అందించే మధ్యాహ్నం భోజనం నాణ్యతతో కూడినదై ఉండాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. గురువారం నాడు మండల పరిధిలోని అక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్లో మధ్యాహ్న భోజన ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేనులో భాగంగా అన్నం (బగారా) తోటకూర పప్పు ను తనిఖీ చేశారు. అన్నం నాణ్యత సరిగ్గా లేనందున వంట సిబ్బంది పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు ఇలాగే పెడుతున్నారా అని అన్నం(బగారా) లో ఎలా చేస్తారో తెలీదా అని మండిపడ్డారు. పిల్లలకు పౌష్టికాహారం అందించకుండా విధులు ఎలా నిర్వహిస్తున్నారని ప్రిన్సిపల్ మరియు ఫుడ్ చెకింగ్ టీచర్ పైన మండిపడ్డారు. కామన్ డైట్ మెనూ పాటించాలని రోజు మధ్యాహ్న భోజన వంట ప్రక్రియను పర్యవేక్షణ చెయ్యాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహారం కడుపునిండా తినాలని అప్పుడే శారీరకంగా బలంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 27: మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన సుమారు 30 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం డీసీసీ అధ్యక్షులు ఆంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీ కండువాలతో జిల్లా అధ్యక్షురాలు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్ యాదగిరి, నాయకులు మాధవరావు, నర్సింగ్ రావు, ఐలమల్లు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్ కోసం సమాజం ముందుకు రావాలి

- అదనపు ఎస్పీ మహేందర్
- బాల్యవివాహాలపై పోలీసుల అవగాహన సదస్సు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 26:- నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాలలో ముందుకు వెళుతున్నారని, బాలికలకు విద్య ద్వారా శక్తి ధైర్యం తో పాటు సామాజిక బాధ్యత తెలుస్తుందని, దీంతోసొంత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని విద్య ద్వారానే సామాజిక స్థితి మారుతుందని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. గురువారం మెదక్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాల్యవివాహాల నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, బాల్యవివాహాలు సమాజ అభివృద్ధికి ఆటంకం కలిగించే ముఖ్య సమస్యగా గుర్తించిన నేపథ్యంలో, విద్యార్థినుల్లో చట్టపరమైన అవగాహన, స్వీయ రక్షణ, బాలల హక్కులపై అవగాహనా కల్పించడం కొరకు ఈ కార్యక్రమం నిర్వహించబడిందని ఆయన తెలిపారు. జీవితాన్ని, విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం, వంటి అనేక విషయాల్లో వెనక్కు నెట్టే ప్రమాదకరమైన చట్ట వ్యతిరేక

చర్య అని, అలాగే 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు వివాహం చేయడం బాల్యవివాహాల నిరోధక చట్టం - 2006 ప్రకారం శిక్షార్హ నేరమని గుర్తు చేస్తూ, తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు లేదా ఇతరులు ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. సమాజంలో బాల్యవివాహాల నిర్మూలనకు విద్యార్థినుల పాత్ర ఎంతో ముఖ్యమని, వారు ఇతరులకు అవగాహన కల్పించే అంబాసిడర్లుగా మారాలని, బాల్యవివాహాలపై సమాచారం లభించినా వెంటనే 100 నెంబర్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, బాలికల భవిష్యత్తు రక్షించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంద తెలిపారు. భరోసా, సాఖీ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది బాల్యవివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక సమస్యలను వివరంగా విద్యార్థినులకు తెలియజేశారు. బాధితులకు అందించే న్యాయ సహాయం, కౌన్సిలింగ్, పునరావాస సేవలు, హెల్ప్‌లైన్ నంబర్లు వంటి ముఖ్య సమాచారం అందించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ విజయ, డీడబ్ల్యూఓ హేమ భార్గవి, ఎస్ఐ సుచిత, అధ్యాపకులు,షీటీం, సఖీ, సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీకి టాటా గ్రూపు లంచం ఇచ్చింది. సెమీకండక్టర్ యూనిట్లకు మోదీ కేబినెట్ ఆమోదం తెలపగానే బీజేపీకి అతిపెద్ద దాతగా టాటా గ్రూపు ఎలా మారింది? రెండు యూనిట్లకు సబ్సిడీ కింద ₹44,203 కోట్లు టాటాకు వస్తాయి. కేబినెట్ అప్రూవల్ వచ్చిన నాలుగు వారాలకు ₹758 కోట్లను బీజేపీకి టాటా గ్రూపు విరాళంగా ఇచ్చింది. ఇది లంచం.

- సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్

ప్రాంతీయం

'ఆరోగ్య మహిళ' వైద్య పరీక్షలు తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- టీఎన్జీవో భవన్ లో మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 27: జిల్లాలోని మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షలను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ టీఎన్జీవో సంఘ భవనంలో ఎన్జీవోల సంఘం, జిల్లా వైద్యారోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. సుమారు 50 వేల రూపాయలు విలువచేసే 45 రకాల పరీక్షలు ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఈ పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రత్యేక క్యాంపుల ద్వారా కూడా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే టీఎన్జీవో భవన్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతాయని ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో భాగంగా టీఎన్జీవో భవన్లో 300 మంది అంగన్వాడీ సిబ్బంది సహా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే మహిళా ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేసినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బందితోపాటు అపోలో రీచ్, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు ఈ సేవలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకట రమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సనా, ఉమా శ్రీ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, మహిళా జేఏసీ నాయకులు ఇరుమల్ల శారద, సునీత, సరిత, విజయలక్ష్మి, లలితమేరీ, రమణ, స్వరూపా, లక్ష్మీ, బాగ్యలక్ష్మి, ఉర్మిళ, అస్గర్ అలీ, గోవిందాపతి శ్రీనివాస్, వాసవి గౌడ్, కోమ్మెర శ్రీనివాస్ రెడ్డి, లవకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియ నిర్వహించాలి

- అధికారులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనలు

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల(రుద్రంగి), నవంబర్ - 27: ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్లో నమోదు చేయాలని అధికారులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులో రుద్రంగి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రతి వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం రుద్రంగిలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రాన్ని తనిఖీ చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ పుష్ప లత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హరిష్ రావు సవాలుకు సమాధానం చెప్పాలి

- హరీష్ మాటాలను వక్రికరిస్తే సహించం
- స్థాయికి మించి మాట్లాడితే తగిన శాస్తి చెప్పకతప్పదు
- కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 27: మాజీ మంత్రి, హరీష్ రావు సవాలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్, లేదా స్థానిక ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ సమాధానం చెప్పాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీష్ రావుపై పరుష పదజాలంతో తమ స్థాయిని మరిచి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడి, హరిష్ రావు దిష్టి బోమ్మను దహనం చేయాడాన్ని చందర్ ఖండించారు. గురువారం ఆయన హరీష్ రావుని దూషించి, దిష్టిబోమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై గోదావరిఖని 1 టౌన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండానికి 800 మెగావాట్ల ధర్మల్ విద్యుత్ ప్లాంట్ కు 10 వేల 880 కోట్ల రూపాయలతో కేబినెట్ లో అమోదం లభించడం విదితమే నని, ఎన్టీపీసీ 7 రూపాయలు ఒక యూనిట్ చోప్పున ప్లాంట్ నిర్మిసామంటే బయట మాకు 5 రూపాయలకే దోరుకుతుందని ప్లాంట్ నిర్మాణానికి 6 ఎళ్ల సమయం పడుతుందని అసెంబ్లీ లో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం జరిగిందని అన్నారు. ఈ 10 వేల 880 కోట్ల రూపాయలతో ప్లాంటు నిర్మాణం అంటే ఒక్క యూనిట్ 8 రూపాయలు పడే అవకాశం ఉందని ఈ విషయం పై మాట్లాడిన మాజీ మంత్రి హరిష్ రావు దిష్టి బోమ్మను దహనం చేయడం సరైంది కాదన్నారు. వారిపై కేసు నమోదు చేసి తగినచర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణ వేణీ, బాదే అంజలి, గాధం విజయ, నాయకులు అచ్చె వేణు, బోడ్డుపల్లి శ్రీనివాస్, నారాయణ దాసు మారుతి జక్కుల తిరుపతి మేడి సదానందం ముద్దసాని సంధ్యా రెడ్డి తోకల రమేష్ సట్టు శ్రీనివాస్ బుర్ర శంకర్ బుర్రి వెంకటేష్ నీరటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలకు చేరుకున్న ఎమ్మెల్యే సాగర్

- కార్యకర్తల ఘన స్వాగతం

ప్రతిపక్షం, మంచిర్యాల, నవంబర్ 27: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు గురువారం ఆరోగ్యంతో మంచిర్యాలకు చేరుకున్నారు. హైదరాబాదు నుండి హెలికాప్టర్ ద్వారా నస్పూర్ వెళ్లి, కారులో తన స్వగృహానికి చేరుకున్నారు. గత గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ప్రేమ సాగరం మంచిర్యాలకు చేరుకోగానే కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆయనకు ఘన స్వాగతం పలికారు. దసరా ఉత్సవాలు జరిపిన అనంతరం ఆయన ఉన్నత చికిత్స నిమిత్తం హైదరాబాద్ హాస్పిటల్లో చేరారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ శ్రేణులు ఘనవిజయం పొందేందుకు ఎమ్మెల్యే కాంగ్రెస్ లో నూతన నూతన ఉత్సాహాన్ని నింపనున్నారు. నస్పూర్ నుండి ఎమ్మెల్యే స్వగృహం వరకు కార్యకర్తలు ర్యాలీతో ఎమ్మెల్యేకు సాదరంగా ఆహ్వానం పలికారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమానికి

వచ్చే బడ్జెట్లో 5000 కోట్లు కేటాయించాలి

- ప్రతి సొసైటీకి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలి
- 22 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిన రాష్ట్ర 4వ మహాసభలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే 2025-26 బడ్జెట్లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి 5000 కోట్లు ప్రణాళిక బడ్జెట్లో కేటాయించి, ఖర్చు చేయాలని, ప్రతి మత్స్య సొసైటీ కి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... కరీంనగర్ పట్టణంలోని కోతి రాంపూర్ లోని ముకుంద లాల్ మిశ్రా భవన్ లో సంఘం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులతో రాష్ట్ర గోరెంకల నరసింహ అధ్యక్షతన సమావేశం జరిగింది... ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి కరీంనగర్ పట్టణంలో విజయవంతంగా మత్స్య కార్మిక సంఘం నాలుగో మహాసభలు జరిగాయని 22 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నదని 19 మంది ఆఫీస్ బారర్,స్ 51 మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో నేటికీ మత్స్య వృత్తిపై ఆధారపడి సుమారు పది లక్షల మత్స్యకార కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి, రాష్ట్రంలో సుమారు 5500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 5లక్షల 60 వేల మంది మత్స్య సహకార సంఘాల సభ్యులుగా ఉన్నారని అన్నారు. 33 జిల్లాలకు జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలు జరపాలి, రాష్ట్ర, జిల్లా ఫెడరేషన్ల కు నామినేటెడ్ పోస్ట్ ద్వారా చైర్మన్ లను ఎన్నిక చేసి తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్యలను నిర్వీర్యం చేస్తున్నారు. వెంటనే అన్ని జిల్లాలకు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఎన్నికలు జరిపి తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరపాలని, తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహ ఉపాధ్యక్షులు పగడాల నాగేశ్వరరావు దీటి శ్రీనివాసరావు గాండ్ల అమరావతి రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌడుగు వెంకట్ భక్కి బాలమణి చంద్రి పుష్ప సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిట్టల వెంకటేష్ జునగరి గణేష్ కోశాధికారి పప్పు సదానంద నగర అధ్యక్ష కార్యదర్శులు మర్రి శశికళ నాగుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు దిష్టిబొమ్మ దగ్ధం

- రామగుండం అభివృద్ధికి అడ్డుపడుతున్న బీఆర్ఎస్
- కోదండ రామాలయం చైర్మన్ గట్ల రమేష్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 27: రామగుండం ప్రజల అభివృద్ధి, రామగుండం పవర్ ప్రాజెక్టులపై అవాస్తవ ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలకు నిరసన గా కోదండ రామాలయం చైర్మన్ గట్ల రమేష్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో హరీష్ రావు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మహంకాళి స్వామి, గట్ల రమేష్ మాట్లాడుతూ హరీష్ రావు ఆరోపణలు పూర్తిగా అబద్ధాలని, రామగుండం అభివృద్ధిని అడ్డు కున్నది గత ప్రభుత్వమేనని, గత 10 ఏళ్లలో రామగుండంలో ఒక్క భారీ ప్రాజెక్ట్ కూడా తీసుకు రాక పోగా ఇప్పుడు వచ్చిన అభివృద్ధి నిర్ణయాలపై విమర్శించడం ప్రజల తీర్పు ను అవమానించడమేనని అన్నారు. 62.5 మెగావాట్ల చిన్న యూనిట్ స్థానంలో 800 మెగా వాట్ల భారీ పవర్ ప్రాజెక్ట్ ఇది కాంగ్రెస్స్ ప్రభుత్వ నిర్ణయంకొత్త ప్రాజెక్టు వల్ల స్థానిక యువత కు వేలాది ఉద్యోగాలు, చిన్న వ్యాపారులకు అవకాశాలు, తెలంగాణ గ్రిడ్ కి భారీగా విద్యుత్ లభిస్తుందని తెలిపారు. రామగుండం అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు నిశ్శబ్దంగా ఉండమని, తెలంగాణాభివృద్ధికి అడ్డంగా ఉన్న రాజకీయ అబద్ధాలను ప్రతి రోజూ, ప్రతి చోటా బహిర్గతం చేస్తాం అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేష్, దీటి బాలరాజు, పాతపెల్లి ఎల్లయ్య, ఎండీ. ముస్తఫా, దొంత శ్రీను, కొమ్ము వేణు, బాలరాజ్ కుమార్, దాతుశ్రీనివాస్, చెరుకు బుచ్చిరెడ్డి, బొమ్మకరాజేష్, తిప్పారపు శ్రీనివాస్, సింహాచలం, ధూళికట్ట సతీష్, కొప్పుల శంకర్, సన్నీ భాయ్, గడ్డం శ్రీనివాస్, నజీమోద్దీన్, కౌటం సతీష్, నజీమ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో 'మోడల్' విద్యార్థుల ప్రతిభ

ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 27: మండలంలోని నవాబు పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎల్టా కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎడ్యుక్వెస్ట్' 'ఇంగ్లీష్ ఒలింపియాడ్' పోటీల్లో ముల్కనూరు మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎ.అశ్వంత్ రెడ్డి, ఇ.స్నేహిత (పదో తరగతి), రష్మిత (ఎనిమిదో తరగతి), వి.కావ్యశ్రీ (ఏడో తరగతి) మండల స్థాయిలో విజేతలుగా నిలిచారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం పట్ల ఎంఈఓ వి పావని, పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజేతలను, వారికి మార్గనిర్దేశం చేసిన ఆంగ్ల విభాగం ఉపాధ్యాయులు సయ్యద్ ఇర్షాద్ అలీ, వేణు, జి.నవీన్ కుమార్‌లను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

బీజేపీ అభ్యర్థులను ఎన్నుకుంటే అభివృద్ధి

- జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్27: బీజేపీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకుంటే అభివృద్ధి జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల తర్వాత స్థానిక సంస్థలకు మోక్షం కలిగిందని, గ్రామాల అభివృద్ధి కేంద్రం ఇస్తున్న నిధులతోనే సాధ్యం అనే విషయాన్ని ప్రజలు గమనించాలని, ఖజానాలో డబ్బులు లేవని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి గ్రామాలను అభివృద్ధి ఎట్లా చేస్తాడో చెప్పాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ గెలిపించిన సిరిసిల్ల ప్రజలను మరిచి రాష్ట్ర రాజకీయాల్లో బిజీ అయిపోయారని ఎద్దేవా చేశారు. ఏకగ్రీవం అయ్యే పంచాయతీలకు పది లక్షల బండి సంజయ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారని, డబ్బులు లేవని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి ఎట్లా చేస్తారో, నిధులు లేని స్థానిక ఎమ్మెల్యే పల్లెలను అభివృద్ధి ఏం చేస్తాడో? ఈ రెండు విషయాలను ప్రజలు గుర్తుంచుకోవాలని, బండి సంజయ్ ప్రతినిధులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో 28 నూతన అనుభవాత్మక స్టోర్లు

- ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగిల్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 27: ఇంటి డెకర్‌ను మరింత సమగ్రంగా అనుభవించేలా ఏషియన్ పెయింట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 28 కొత్త ఎక్స్‌పీరియన్షియల్ స్టోర్లు ప్రారంభించింది. వీటిలో 5 కలర్ ఐడియాస్ షోరూమ్లు, 23 కలర్ క్యూబ్ స్టోర్లు ఉన్నాయి. పెయింట్స్ నుంచి పూర్తి డెకర్ వరకు అన్నీ ఒకేచోట అందించే విధంగా ఇవి రూపొందించబడ్డాయి. ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగిల్ మాట్లాడుతూ, ఈ విస్తరణతో రెండు రాష్ట్రాల్లోనే అతి పెద్ద పెయింట్, డెకర్ రిటైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. టచ్‌అండ్‌ఫీల్ అనుభవంతో ప్రీమియం పెయింట్ ఫినిష్‌లు, డిజైనర్ వాల్‌పేపర్లు, టెక్స్చర్లు, ఉడ్ ఫినిష్‌లు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కొత్త స్టోర్లు తెలంగాణలో సిద్దిపేట, బోధన్, భైంసా, అల్వాల్, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, తణుకు, మార్టూరు, వైజాగ్, విజయనగరం ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. హైదరాబాదులో ఇప్పటికే 44 స్టోర్లు ఉన్నాయి. ప్రాంతీయ అభిరుచులను దృష్టిలో ఉంచుకొని ట్రాక్టర్ ఎమల్షన్, ఏస్ ఎమల్షన్ రీజినల్ స్పెషల్ ఎడిషన్ ప్యాక్స్ కూడా లాంచ్ చేశారు. కలర్ ఐడియాస్ షోరూమ్లలో 3డీ విజువలైజేషన్‌తో గదులను చూపించే కలర్ కన్సల్టెంట్లు, 3,000 పైగా పెయింట్ షేడ్స్, డిజైనర్ టెక్స్చర్లు, సబ్యసాచీ వాల్‌పేపర్ కలెక్షన్ వంటి డెకర్ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. కాంపాక్ట్ రిటైల్ కాన్సెప్ట్‌గా రూపొందించిన కలర్ క్యూబ్ స్టోర్లు ఇప్పటికే ఉన్న డీలర్ షాప్‌లలో 100-150 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసి వినియోగదారులకు ప్రీమియం డెకర్ సొల్యూషన్లు మరింత చేరువ చేస్తాయి. ఈ అనుభవ కేంద్రాలు స్థానిక డీలర్లు, పెయింటర్లు, కాంట్రాక్టర్ల నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కూడా సహకరించనున్నాయని ఏషియన్ పెయింట్స్ తెలిపింది. డిజైన్, టెక్నాలజీ, వ్యక్తిగత కన్సల్టేషన్‌లను ఒకేచోట అందిస్తూ, వినియోగదారులు తమ ఇళ్లను ఎలా ఊహించుకోవాలో కొత్త ప్రమాణాన్ని సృష్టించడమే లక్ష్యమని సంస్థ పేర్కొంది.

దేవుడు వరం ఇస్తే కుటుంబం మళ్లీ సంతోషంగా కలిసి ఉండాలని కోరుకుంటా. భారతీయ కుటుంబాల్లో గొడవలు సహజం. కానీ చివరికి అందరూ ఒక్కటిగా ఉండటం ముఖ్యం. గొడవల గురించి తాను బాధపడలేదన్న వార్తలు తప్పు. ఆ సమయంలో తీవ్రమైన మానసిక వేదన అనుభవించినప్పటికీ బయటపెట్టలేదు.
-నటి మంచు లక్ష్మి

నేత్రపర్వంగా మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు

- అమ్మవారి నామస్మరణతో మారుమోగిన ఖానాపూర్
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, (ఖానాపూర్), నవంబర్ 27: ఖానాపూర్ పట్టణంలో వెలిసిన అతి పురాతమైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ చతుర్థి వార్షికోత్సవ వేడుకలు గురువారం నేత్రపర్వంగా జరిగాయి. గణపతి పూజ, పుణ్యహవచనం, పంచంగవ్య ప్రాసనం, ఆదిత్యాది నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్ర పాలక, షాడాపచార పూజలు, అమ్మవారికి విశేష ఫల పంచామృతాభిషేకం, హోమం, మహాలక్ష్మి మూల మంత్ర హోమం, పంచాసూక్త, రుద్ర, జయది హోమాలు, మహాపూర్ణహుతి పూజలు వేద పండితులు పిసుపాటి రేవంత్ శర్మ వేద మంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు హోమ పూజలో పాల్గొన్నారు. మాజీ ఏపీపీఎస్సీ సభ్యులు పైడిపెల్లి రవీందర్ రావ్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి జాన్సన్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి నామస్మరణతో పట్టణం మారుమోగింది. పట్టణ ప్రజలే కాకుండా వివిధ గ్రామాల నుండి భక్తులు తరలి వచ్చి పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. అర్చకులు ఆలయ విశిష్టత గురించి తెలియజేసారు.

నిధుల కోసమేనా సర్పంచ్ ఎన్నికలు

- ఎంపీ అరవింద్ విమర్శలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలు కేంద్ర నిధుల కోసమే నిర్వహిస్తున్నట్లుగా ఉందని జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ సింబల్ లేని ఎన్నికలు నిర్వహిస్తోందని, అదే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఎందుకు వెళ్లడం లేదని ఎంపీ ప్రశ్నించారు. ఈ ఎన్నికలు కేవలం రాజకీయ డ్రామా మాత్రమే అని విమర్శించారు. అలాగే స్థానిక ఎన్నికల్లో మహిళా ఓట్లకోసమే వడ్డీ లేని రుణాల పేరుతో ప్రభుత్వం డ్రామాలు చేస్తుందని ఆరోపించారు. గత 10 సంవత్సరాల నుంచి మహిళా గ్రూపులకు సుమారు రూ. 630 కోట్ల పావులా వడ్డీలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ కి ఖచ్చితంగా చివాట్లు పెడతారని ఎద్దేవ చేశారు.

డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు..

జిల్లాలో ఆర్వోబీలకు సంబంధించి నిధులు విడుదల చేసినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎంపీ అర్వింద్ ధన్యవాదాలు తెలిపారు. మరో పది రోజుల్లో అడవి మామిడిపల్లి పనులు పూర్తవుతాయని, మాధవనగర్ వద్ద నిలిచిపోయిన పనులు మళ్ళీ మొదలు అయినట్లు తెలిపారు. బోధన్‌లో రెండు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ పనుల పట్ల స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్తశుద్ధితో దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా అర్సపల్లి ఆర్వోబీ కోసం భూ సేకరణ పనులు పూర్తి కాలేదని త్వరగా పూర్తి చేయాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని 17శాతం మాత్రమే కేటాయించిందని, బీసీలకు ఫీజ్ రీయింబర్స్‌మెంటే ఇవ్వలేని రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఏం ఇస్తుందని ఎంపీ అర్వింద్ ఎద్దేవా చేశారు. ఇదంతా రాజకీయ డ్రామా అని విమర్శించారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పోతనకర్ లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్లు సజావుగా జరగాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్ (ఖానాపూర్), నవంబర్ 27 : ప్రస్తుతం జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని, నిర్వహణకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ మొత్తం సాఫీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కును పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని చెప్పారు. నామినేషన్ల దాఖలుకు అవసరమయ్యే పత్రాలు, వివరాలను వారికి వివరించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు తెలియజేసారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఉంటుందని, ప్రతిరోజు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి, సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాలని వివరించారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి నిర్దేశించిన రిజిస్టర్లను తప్పని సరిగా నిర్వహించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీఓ రత్నాకర్, ఎన్నికల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన పోలీస్ కమిషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 27 : రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 లో భాగంగా మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ లను గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బినోల గ్రామ పంచాయతీ లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నామినేషన్ ప్రక్రియను గురించి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి నామినేషన్ సెంటర్ దగ్గరలో 100మీ.ల లోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సీపీ వెంట నవీపేట్ ఎస్సైలు తిరుపతి యాదగిరి గౌడ్, ప్రొసీడింగ్ ఆఫీసర్ కె. అనిత వారి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో తొలి రోజు నామినేషన్లు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 27 : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. తొలి విడతలో భాగంగా మొదటి రోజు బోధన్ డివిజన్‌లో అధికారులు గురువారం నామినేషన్లను స్వీకరించారు. తొలి విడతలో భాగంగా మొదటి రోజు బోధన్ డివిజన్‌లోనీ 11 మండలాల్లో 140 నామినేషన్లను అధికారులు స్వీకరించారు. ఇందులో బోధన్ మండలంలో 17, చందూర్ 6, కోటగిరి 13, మోస్రా 6, పోతంగల్ 14, రెంజల్ 12, రుద్రూర్ 10, సాలూర 17, వర్ని 19, ఎడపల్లి 9, నవీపేట్ 17 నామినేషన్లు దాఖలయ్యాయి.

కామారెడ్డి జిల్లాలో..

జిల్లాలో తొలిరోజు నామినేషన్లు జోరుగా దాఖలయ్యాయి. మొదటి విడత ఎన్నికలు జరిగే 167 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులుగా 115 మంది నామినేషన్ దాఖలు చేయగా 1,520 వార్డుల్లో 4,520 మంది నామినేషన్లు వేశారు. అనేక గ్రామాల్లో శుక్రవారం నామినేషన్ దాఖలు చేయాలనుకున్నా.. అష్టమి కారణంగా గురువారమే నామినేషన్లు వేశారు. మరికొందరు చివరి రోజు దశమి కావడంతో ఆదివారం నామినేషన్ వేయడానికి నిర్ణయించుకున్నట్టుగా తెలుస్తోంది.

జిల్లా ఎన్నికల అధికారితో ఎలక్షన్ అబ్జర్వర్ భేటీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 27 : గ్రామ పంచాయతీ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గా నియమితులైన వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలల ప్రత్యేక అధికారి జి.వి.శ్యాంప్రసాద్ లాల్ గురువారం కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో భేటీ అయ్యారు. జనరల్ అబ్జర్వర్ కు పూలమొక్క అందించి స్వాగతం పలికిన కలెక్టర్, జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు. చేసిన ఏర్పాట్ల గురించి తెలియజేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. కాగా, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జనరల్ అబ్జర్వర్ కు ఫిర్యాదులు, సూచనలు చేయదలచిన వారు సెల్ నెంబర్: 6309505554 కు ఫోన్ చేయవచ్చని, మెయిల్ ఐ.డీ: observergpelec.nzb@gmail.com ద్వారా కూడా తెలుపవచ్చని ఎన్నికల పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సూచించారు.

వరి కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి : కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 27: వరి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. మాచారెడ్డి మండలం, సోమారం పేట్ గ్రామ పంచాయితీ పరిధి లోని నెమలి గుట్ట తాండాలో వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో వరి స్వీకరణ విధానం, తూకాల యంత్రాలు, నిల్వ సౌకర్యాలు, రైతులకు అందిస్తున్న సేవలు, బిల్లుల జారీ , లోడింగ్ వంటి అంశాలను సమీక్షించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.రైతుల సమస్యలను కలెక్టర్ నేరుగా తెలుసుకొని, వెంటనే పరిష్కారం కోసం సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరి కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. తనిఖీలో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డీఎమ్ శ్రీకాంత్, తహసిల్దార్ సరళ, ఎంపీడీవో శ్రీనివాస్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు

- విధులతో పాటు హక్కుల కోసం పోరాడాలి
- నిర్మల్ ప్రెస్ క్లబ్ లో జాతీయ పత్రికా
- దినోత్సవం లో విశ్రాంత జర్నలిస్టులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 27: సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని,దానిని కాపాడుకుంటూ.. విధులను నిర్వర్తించాలని విశ్రాంత జర్నలిస్టులు కట్టా నాగచారి, మహురం గంగాధర్,పత్తి శివప్రసాద్, సీహెచ్.ఎల్.ఎన్.చారి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎమ్.సి.లింగన్న లు అన్నారు. గురువారం నిర్మల్ క్లబ్ లో జాతీయ పత్రిక దినోత్సవాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాసం శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు పురస్తు సురేందర్ కుమారుడు సాయి చరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో.. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే ఇటీవల రిపోర్టర్లు నరేందర్ వాళ్ళ నాన్న, వసీవుల్లా వాళ్ల అమ్మగారు మరణించడంతో వారికి కూడా సభ్యులందరూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత జర్నలిస్టులు మాట్లాడుతూ ..విలేకరులు విధులతో పాటు హక్కల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రోజు రోజుకు పత్రికా రంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా పాత్రికేయులు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాబోవు రోజుల్లో పత్రిక రంగం ప్రమాదంలో పడుతుందని, ఎలక్ట్రానిక్ మీడియా,సోషల్ మీడియా ఆధిపత్యం పెరిగిపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వాలు స్పందించి పాత్రికేయులకు జీవన భృతి, ఇళ్ల స్థలాలు, వారి పిల్లలకు విద్యా రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా శాలువా తో సన్మానించి, మెమంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాసం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ,ప్రింట్ , ఉర్దూ, ఎలక్ట్రానిక్ వివిధ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

ఎస్టీయు ఉపాధ్యాయ సంఘానికి రాజీనామా

ప్రతిపక్షం ప్రతినిధి నిర్మల్, (ఖానాపూర్) నవంబర్ 27 : ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘానికి ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మినర్సయ్య గురువారం రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు భూమన్న యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేందర్ లు సంఘాన్ని విచ్చిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, తాను మనస్థాపం చెంది, ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదివికి, ప్రాథమిక సభ్యత్వంకు రాజీనామా చేసానని పేర్కొన్నారు. జిల్లాలో ఎలాంటి కార్యక్రమాలు జరిగిన తమకు తెలియకుండా చేయటం సరైంది కాదని అన్నారు.

నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 27 : గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ నిజామాబాద్ జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలైన బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లితో పాటు నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ లోని నవీపేట మండలం పరిధిలోని 184 సర్పంచ్, 1642 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో నవీపేట మండలం అభంగపట్నం, రెంజల్ మండలం వీరన్నగుట్ట, ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామపత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

రైతులకు నష్టం లేకుండా ధాన్యం కొంటున్నాం. 24 గంటల్లోనే ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. అయినా వైసీపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రూ1,674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వాళ్లా రైతుల పక్షాన మాట్లాడుతున్నారు. 8.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. దళారులను నమ్మి రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు.

- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

విశ్వ వీక్షణం

జెన్ జెడ్ టాలెంట్ ఓ బెంచ్ మార్క్

- ప్రశంసించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 27: భారత యువత, ముఖ్యంగా జెన్ జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని అన్నారు. భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్ I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ 'మన యువత, మన జెన్‌జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది' అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయన్నారు.

'కోర్టు మాత్రం ఏం మ్యాజిక్ చేయగలదు?!

- ఢిల్లీ పొల్యూషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 27: దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు దిగజారిపోతున్నది. ఈ క్రమంలో ఢిల్లీలో కాలుష్య కట్టడి కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు డిసెంబర్ మూడున విచారించనున్నట్లు తెలిపింది. ఈ కాలుష్య సమస్యను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అయితే, పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన వాదనను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. 'కాలుష్యం విషయంలో కోర్టు ఏం మ్యాజిక్ చేయగలదు' అని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. 'ఒక న్యాయస్థానం ఏం మాయాజాలం చేయగలదు? ఢిల్లీ ఎన్‌సీఆర్‌కు ఇది ప్రమాదకరమని తెలుసు. అయితే పరిష్కారం ఏమిటనేది ఇక్కడ ముఖ్యం. దీనికి గల కారణాలను గుర్తించాలి. పరిష్కారాలు కేవలం ఆ రంగంలోని నిపుణుల నుంచే లభిస్తాయి. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేం ఆశిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఈ దేశ పౌరుడు కాని వారికి ఓటు హక్కు ఇవ్వాలా?

- చొరబాటుదారులకు 'ఆధార్'పై సుప్రీం ఆగ్రహం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 27: చొరబాటుదారులు ఆధార్ కార్డులు పొందటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆధార్ కార్డు కలిగిఉన్నంత మాత్రాన ఈ దేశ పౌరుడు కాని వారికి ఓటు హక్కు ఇవ్వాలా? అని ప్రశ్నించింది. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడానికి మాత్రమే అధార్ పనికి వస్తుందని, ఆధార్ కార్డు దేశ పౌరసత్వానికి సరైన రుజువు కాదని తెలిపింది. పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. అధార్ చట్టం దేశ పౌరసత్వాన్నిగానీ, నివాస స్థలాన్నిగానీ ఇవ్వదని బెంచ్ స్పష్టం చేసింది. అలాగే, ఓటును హక్కును తొలగించే ముందు నోటీసు ఇవ్వాలని కోర్టు సూచించింది. ఎవరైనా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కోసం దరఖాస్తుతోపాటు సమర్పించిన ధ్రువపత్రాల అధారంగా ఓటు హక్కు ఇవ్వాల వద్దా అని నిర్ణయించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఎలక్షన్ కమిషన్ పోస్టాఫీసు కాదని పేర్కొంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో సర్ ని ప్రత్యేకంగా సవాలు చేస్తున్న ధాఖలైన పిటిషన్లను విచారించడానికి సుప్రీంకోర్టు షెడ్యూల్‌ను కూడా నిర్ణయించింది. డిసెంబర్ ఒకటి లోగా ప్రతిస్పందనలను దాఖలు చేయాలని బెంచ్ ఎన్నికల కమిషన్‌ను కోరింది. పిటిషనర్లు తమ వాదనలను దాఖలు చేయవచ్చని, త్వరలోనే ఈ విషయాలు విచారణకు వస్తాయని తెలిపింది.

షేక్ హసీనాకు 21 సంవత్సరాల జైలుశిక్ష

- బంగ్లా మాజీ ప్రధానికి స్థానిక కోర్టు షాక్

ఢాకా (బంగ్లాదేశ్), నవంబర్ 27: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బిగ్ షాక్ తగిలింది. మూడు అవినీతి కేసులలో ఆమెకు బంగ్లాదేశ్ కోర్టు 21 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు స్థానిక మీడియా గురువారం వెల్లడించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని బీఎస్ఎస్ వార్తా సంస్థ ప్రకారం, పుర్బాచోల్‌లోని రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్ట్‌లో ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఈ మూడు కేసులు హసీనాపై దాఖలు చేయబడ్డాయి. మూడు కేసులలో ప్రతి కేసులోనూ కోర్టు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఢాకా స్పెషల్ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ కేసులలో షేక్ హసీనా కొడుకు, కూతురికి కూడా కోర్టు శిక్ష విధించింది. ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్ కు కోర్టు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష టాంకుల జరిమానా విధించగా, కుమార్తె సైమా వాజెద్ పుతుల్ కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

వైట్ హౌస్ దగ్గర కాల్పుల కలకలం

- ఇద్దరు గార్డులకు తీవ్ర గాయాలు: ఆస్పత్రికి తరలింపు

న్యూజెర్సీ (అమెరికా), నవంబర్ 27 : అమెరికా రాజధాని వాషింగ్టన్ వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్‌కు చెందిన ఇద్దరు సభ్యులపై బుధవారం వైట్ హౌస్‌కు కొద్ది దూరంలో కాల్పులు జరిగాయి. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. టార్గెటెడ్‌గానే దాడి జరిగిందని మేయర్ మురియెల్ బౌసర్ చెప్పడం ఆందోళనలను రేకెత్తించింది. ఘటన జరిగిన వెంటనేఎఫ్బీ, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఒక అనుమానితుడిని అరెస్టు చేశారు. వాషింగ్టన్ డీసీలో ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులపై కాల్పులు జరిపిన నిందితుడిని 29 యేండ్ల అఫ్గాన్ పౌరుడు రహ్మనుల్లాగా గుర్తించారు. ఈ దాడి సైనికులను కావాలనే లక్ష్యంగా చేసుకుని జరిగిందా! అని ఆరా లాగేందుకు ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి. కేసును ఉగ్ర కోణం నుంచి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన నిమిషాలలోనే, పెద్ద సంఖ్యలో పోలీసులు, అగ్నిమాపక విభాగాలు, హెలికాప్టర్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. కాల్పులు జరిగిన ప్రాంతం మొత్తాన్ని భయాందోళనలకు గురిచేశాయని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు, దారుణ ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. రాజధానికి 500 మంది అదనపు సైనికులను మోహరించాలని ట్రంప్ పెంటగాన్‌ను ఆదేశించారు. దాడి తర్వాత కాంప్లెక్స్ వెంటనే మూసివేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో ట్రంప్ ఫ్లోరిడాలోని తన మార్ ఎలాగో క్లబ్‌లో ఉన్నారు.

అందాల బీచ్ చూద్దామా!!

మన దేశంలో చాలా బీచ్ లు ఉన్నాయి. అయితే.... అందులో కొన్ని స్పెషల్ బీచ్ లు ఉన్నాయి. మీరు కనుక వచ్చే నూతన సంవత్సరాన్ని బీచ్ దగ్గర ఎంజాయ్ చేయాలి అనుకుంటే కచ్చితంగా ఈ బీచ్ లకు వెళ్లాల్సిందే. జీవితంలో ఒక్కసారైనా చూడాల్సిన బీచ్ లు ఏంటో ఓసారి చూద్దాం..

అగొండా బీచ్, గోవా

గోవా అంటేనే బీచ్. బంగారు రేణువులతో నిండిన ఇసుక, ప్రశాంతమైన అలల మధ్య రిలాక్స్ అవ్వాలంటే అగొండా బీచ్‌కి వెళ్ళండి. దక్షిణ గోవాలో ఉన్న ఈ బీచ్ పణజీ నుండి 15 నిమిషాల దూరంలో ఉంది.

రాధానగర్ బీచ్, హావ్‌లాక్ దీవి, అండమాన్

అండమాన్‌లోని రాధానగర్ బీచ్ స్వచ్ఛమైన నీరు, తెల్లని ఇసుకకు ప్రసిద్ధి. ప్రశాంత వాతావరణం, అందమైన ప్రకృతి ఇక్కడ ఉంది. రిలాక్స్ అవ్వాలనుకునేవారికి ఇది సరైన ప్రదేశం.

అంజునా బీచ్, గోవా

పార్టీ చేసుకోవాలంటే అంజునా బీచ్‌కి రండి. ఉత్తర గోవాలోని ఈ బీచ్‌లో కలర్ ఫుల్ పార్టీలు జరుగుతాయి. రాత్రంతా డాన్స్ చేయాలంటే అంజునా బీచ్ మరపురాని అనుభూతినిస్తుంది.

కోవలం బీచ్, కేరళ

దక్షిణ భారత స్వర్గం అని పిలువబడే కోవలం బీచ్ స్వచ్ఛమైన నీరు, మెత్తటి తెల్లని ఇసుక, కొబ్బరి చెట్లతో నిండి ఉంది. ఈ అందమైన బీచ్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. వాటర్ స్పోర్ట్స్‌లో కూడా పాల్గొనవచ్చు.

నీల్ దీవి, అండమాన్, నికోబార్

అండమాన్, నికోబార్‌లోని నీల్ దీవి విదేశీ పర్యాటకులకు ఇష్టమైన ప్రదేశం. పచ్చదనంతో నిండిన ఈ బీచ్ చాలా అందంగా ఉంటుంది. రోడ్లపై సైక్లింగ్ చేయవచ్చు. స్నార్కెలింగ్ కూడా చేయవచ్చు.

మహాబలిపురం బీచ్, చెన్నై

బంగాళాఖాతం ఒడ్డున ఉన్న మహాబలిపురం బీచ్ చారిత్రకంగా ముఖ్యమైనది. 7వ శతాబ్దపు ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. ప్రాచీన వాస్తుశిల్పం, అందమైన తీరం మిమ్మల్ని ఆకర్షిస్తాయి.

మెరీనా బీచ్, చెన్నై

ప్రపంచంలోనే రెండవ అతి పొడవైన బీచ్ మెరీనా బీచ్. దక్షిణ భారత సౌందర్యాన్ని ఆస్వాదించడానికి ఇది సరైన ప్రదేశం. పొడవైన తీరం, చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి.

కారైకాల్ బీచ్, పాండిచ్చేరి

పాండిచ్చేరిలోని కారైకాల్ బీచ్ అరసలార్ నది, బంగాళాఖాతం కలిసే చోట ఉంది. సూర్యోదయం, సూర్యాస్తమయం చూడటానికి బాగుంటుంది. ప్రశాంత వాతావరణం, అందమైన ప్రకృతి ఉన్న కారైకాల్ బీచ్ ప్రకృతి ప్రియులకు, ఛాయాచిత్రాలకు అనువైనది.

రుషికొండ బీచ్, విశాఖపట్నం

రుషికొండ బీచ్ బంగారు ఇసుక, స్వచ్ఛమైన నీటికి ప్రసిద్ధి. కుటుంబంతో వచ్చి ఆనందించడానికి అనువైనది. పిల్లలు, పెద్దలు కలిసి సమయం గడిపేందుకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది.

అరామ్‌బోల్ బీచ్, గోవా

ఉత్తర గోవాలోని అరామ్‌బోల్ బీచ్ ప్రశాంత వాతావరణానికి ప్రసిద్ధి. నిశ్శబ్దం కోరుకునేవారికి ఇది మంచి ప్రదేశం. దగ్గర్లో ఉన్న మంచినీటి సరస్సు ఈ బీచ్ ప్రత్యేకత. దీనివల్ల అరామ్‌బోల్ బీచ్‌కి చాలా మంది వస్తుంటారు.





ఓటమికి ఆ రెండే కారణం

హెడ్ కోచ్ గంభీర్ కు సునీల్ గవాస్కర్ మద్దతు

భారత టెస్ట్ క్రికెట్ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. గతేడాది న్యూజిలాండ్ క్లీన్‌స్వీప్ చేసిన విషం తెలిసిందే. తాజాగా దక్షిణాఫ్రికాపై 20 తేడాతో వైట్ వాష్‌కు గురైంది. ఈ క్రమంలో టీమిండియా, హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో టీమిండియా మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ స్పందించారు. టెస్ట్ సిరీస్‌లలో ప్రత్యర్థి జట్లు భారత్ కంటే మెరుగ్గా కష్టపడ్డాయని.. ఫలితంగా ప్రయోజనం పొందాయన్నారు. ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు భారత పరిస్థితులకు అనుగుణంగా తమను తాము ముందే సిద్ధం చేసుకున్నాయని, దాంతో రాణించాయన్నారు. భారత్‌కు రాక ముందు న్యూజిలాండ్ శ్రీలంకలో ఆడిందని.. అక్కడి పిచ్‌లు, వాతావరణం వారికి ఉపయోగపడిందన్నారు. దక్షిణాఫ్రికా ఏ జట్టు భారత్‌లో ఇండియాఏతో మ్యాచ్ ఆడిందని.. ఇందులోని ఆటగాళ్లకు ఇక్కడి పరిస్థితుల గురించి తెలిసిందన్నారు. భారత జట్టు ఓటమికి ప్రధాన కారణం అదేనన్నారు. భారత జట్టును రెండు ఫార్మాట్ల మధ్య పదే పదే తిప్పడం వల్ల ఆటగాళ్లలో అలసట పెరుగుతోందన్నారు. టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన సన్నద్ధత పొందకుండా నిరోధించబడుతుందన్నారు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఆడిన సమయంలో వన్డే సిరీస్ అవసరం లేదని.. ఎదుకంటే 2027లో వన్డే ప్రపంచకప్ జరుగుతుందన్నారు. అయినా భారత్ షెడ్యూల్‌ను ఫాలో కావాల్సి వచ్చిందన్నారు. ఇవన్నీ మార్కెట్ శక్తులన్ని.. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మార్కెట్ అని.. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న జట్లు టీమిండియాను ఆహ్వానిస్తాయన్నారు. అలా చేయడం వల్ల టెస్ట్ క్రికెట్ కోసం సన్నద్ధతపై ప్రభావం చూపుతుందన్నారు. భారత్ డొమెస్టిక్ సీజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆస్ట్రేలియా డొమెస్టిక్ సీజన్‌లో పర్యటనకు వెళ్లదని.. మనం సైతం అలా విదేశాలకు వెళ్లకూడదన్నారు.



వుమెన్ ప్రీమియర్ లీగ్.. కోట్లు కొల్లగొట్టిన అమ్మాయిలు

మైదానంలో బ్యాటుతో, బంతితో అదరగొట్టిన అమ్మాయిలు ఇప్పుడు కోట్లకు పడగలెత్తారు. నవంబర్ 27న జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ మెగా వేలంలో రికార్డు ధర(రూ.3.20కోట్లు)తో దీప్తి శర్మ చరిత్ర సృష్టించగా.. ప్రపంచకప్‌లో తిప్పేసిన శ్రీచరణి రూ.1.30కోట్లు పలికింది. ఇటీవల అద్భుతంగా రాణించిన పలువురు యువకెరటాలు సైతం అందర్నీ ఆశ్చర్యపరుస్తూ కోట్లు కొల్లగొట్టారు. ఐపీఎల్ తరహాలో మహిళా క్రికెటర్ల కోసం మొదలైన డబ్ల్యూపీఎల్‌కు ప్రేక్షకాదరణ రెట్టింపైంది. అందుకే.. నాలుగో సీజన్ వేలంలో క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. మెగా ఆక్షన్‌లో వరల్డ్ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన దీప్తి శర్మ రూ.3.20 కోట్లు పలికింది. స్టార్ ఆల్‌రౌండర్ అయిన దీప్తి కోసం ఆమె గతంలో ఆడిన యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడ్డాయి. చివరకు రైట్ టు మ్యాచ్ ఉపయోగించుకొని దీప్తిని పట్టేసింది యూపీ. ఆల్‌రౌండర్ అయిన శిఖా పాండే ను రూ.2.40 కోట్లకు యూపీ దక్కించుకుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణిని రూ.1.30 కోట్లకు ఢిల్లీ తిరిగి సొంతం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ వేలంలో ఆర్టీఎం కాకండా అత్యధిక ధర పలికిన వాళ్లలో అమేలియా కేర్ టాప్‌లో ఉంది. రెండుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ టీమ్‌లో సభ్యురాలైన ఈ కివీస్ స్టార్‌ను ఆ ఫ్రాంచైజీ రూ.3 కోట్లకు దక్కించుకుంది. భారత క్రికెటర్ల విషయానికొస్తే దీప్తి శర్మ టాప్‌లో ఉంది. శిఖా పాండేను రూ.2.40 కోట్లకు యూపీ దక్కించుకుంది.

అమేలియా కేర్	**రూ.3 కోట్లు (ముంబై ఇండియన్స్)**
సోఫీ డెవినె	**రూ.2 కోట్లు (గుజరాత్ జెయింట్స్)**
చినెల్లె హెన్రీ	**రూ.1.30 కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్)**
ఫాబే లిచ్‌ఫీల్డ్	**రూ.1.20 కోట్లు (యూపీ వారియర్స్)**
లారెన్ బెల్	**రూ.90 లక్షలు (ఆర్సీబీ)**

భారత క్రికెటర్లలో టాప్ -5

దీప్తి శర్మ	**రూ.3.20 కోట్లు**
శిఖా పాండే	**రూ.2.40 కోట్లు**
శ్రీచరణి	**రూ.1.30 కోట్లు**
ఆశా శోభన	**రూ.1.10 కోట్లు**
భారతి ఫుల్‌మలి	**రూ.70 లక్షలు**

జనవరి 9 నుంచి వుమెన్ ప్రీమియర్ లీగ్

వడోదరలో ఫైనల్ మ్యాచ్.. వెల్లడించిన బీసీసీఐ

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌కు ముహూర్తం ఖారారైంది. మెగా వేలం రోజునే టోర్నీ ఆరంభ తేదీని బీసీసీఐ వెల్లడించింది. ఊహించినట్టుగానే జనవరిలోనే నాలుగో సీజన్ ప్రారంభం కానుంది. అయితే.. ముందుగా వినిపించిన జనవరి 7న కాకుండా జనవరి 9 నుంచి సీజన్ మొదలవ్వనుందని డబ్ల్యూపీఎల్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ పేర్కొన్నారు. పురుషుల టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపిన విషయం తెలిసిందే. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లకు ఈసారి రెండు వేదికలనే ఖరారు చేశారు. నవీ ముంబై, వడోదర లోనే అన్ని మ్యాచ్‌లు నిర్వహిస్తామని డబ్ల్యూపీఎల్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ తెలిపారు. జనవరి 9న నవీ ముంబైలో టోర్నీ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 5 న వడోదరలో ఫైనల్ బీసీసీఐ తెలిపింది. త్వరలోనే పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు. డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ నాలుగు నగరాల్లో జరిగింది. ముంబై, బెంగళూరు, లక్నో, వడోదరలో మ్యాచ్‌లు నిర్వహించారు. అయితే.. కొన్ని కారణాల వల్ల ఈసారి రెండు నగరాలను మాత్రమే ఎంచుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు పర్యాయాలు, ఆర్సీబీ ఒకసారి విజేతగా నిలిచాయి. దాంతో.. నాలుగో సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచేందుకు ఢిల్లీ సిద్ధమవుతుండగా.. తొలిసారి ట్రోఫీని ముద్దాడాలని యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ పట్టుదలతో ఉన్నాయి.

2030 కామన్వెల్త్ పోటీలు..

అహ్మదాబాద్ కే ఆతిథ్య హక్కులు

భారత్ మరో మెగా క్రీడాటోర్నీకి వేదిక కాబోతున్నది. సరిగ్గా రెండు దశాబ్దాల తర్వాత ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ ఆతిథ్య హక్కులను భారత్ సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ వేదికగా 2030 ఈ పోటీలు జరగనున్నాయి. గత నెలలోనే అహ్మదాబాద్ నగరం ప్రాథమికంగా ఎంపిక కాగా బుధవారం ఇక్కడ జరిగిన కామన్వెల్త్ స్పోర్ట్స్ జనరల్ అసెంబ్లీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. అహ్మదాబాద్‌ను శతాబ్ది కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య వేదికగా ప్రకటిస్తూ అధికారికంగా ప్రకటించారు. జనరల్ అసెంబ్లీలో 74 మంది సభ్యులు భారత బిడ్డింగ్‌కు ఆమోదముద్ర వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో 2010(ఢిల్లీ) తర్వాత భారత్ మరోమారు ఈ టోర్నీకి వేదిక కాబోతున్నది. కామన్వెల్త్ స్పోర్ట్స్ ఎవల్యూషన్ కమిటీ పరిశీలన అనంతరం ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ మేరకు ఆతిథ్య హక్కులు అహ్మదాబాద్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై కామన్వెల్త్ స్పోర్ట్ అధ్యక్షుడు డాక్టర్ డొనాల్డ్ రూక్రె స్పందిస్తూ 'భారత్‌లో భారీ సంఖ్యలో ఉన్న యువతకు, ఘనమైన చరిత్రకు, క్రీడల పట్ల వారికున్న అంకితభావానికి గుర్తుగా తదుపరి వందేండ్ల కామన్వెల్త్ గేమ్‌స్‌ను అహ్మదాబాద్‌లో జరిపేందుకు నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొన్నారు. 2030లో కామన్వెల్త్‌గేమ్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకోవడం ద్వారా 2036 ఒలింపిక్స్ క్రీడల రేసులో నిలిచేందుకు భారత్‌కు మంచి అవకాశం లభించిందని పలువురు క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

'అనగనగా ఒక రాజు'

పాట పాడి అదరగొట్టిన నవీన్ పొలిశెట్టి

వరుసగా మూడు ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా మొదటి గీతం విడుదలైంది. 'భీమవరం బల్మా' పేరుతో వచ్చిన ఈ పాట, కాస్త ముందుగానే పండుగ వాతావరణాన్ని తీసుకొని వచ్చింది. మాస్ ప్రేక్షకులతో పాటు, యువత మెచ్చేలా 'భీమవరం బల్మా' గీతం ఉంది. ఈ పాటతో మొదటిసారి గాయకుడిగా మారిన నవీన్ పొలిశెట్టి, తొలి ప్రయత్నంలోనే ఆకట్టుకున్నారు. వినోదాన్ని పంచడంలోనే కాదు, పాటను ఆలపించడంలోనూ దిట్ట అనిపించుకున్నారు. ఇక కథానాయిక మీనాక్షి చౌదరితో కలిసి ఈ పాటలో ఆయన చేసిన నృత్య ప్రదర్శన కట్టిపడేసింది. ఇద్దరి జోడి చక్కగా కుదిరి, పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. మిక్కీ జె మేయర్ సంగీతం ఈ పాటకు ప్రధాన బలంగా నిలిచింది. విన్న వెంటనే శ్రోతల మనసు దోచుకోని, వారిచే కాలు కదిపించేలా.. ఆయన స్వరపరిచిన తీరు మెప్పించింది. చంద్రబోస్ అందించిన సాహిత్యం కూడా ఆకట్టుకునేలా ఉంది. అందరూ పాడుకునేలా తేలికైన పదాలతో.. ఎంతో అందంగా, అర్థవంతంగా పాటను రచించారు. నవీన్ పొలిశెట్టితో కలిసి గాయని నూతన మోహన్ అద్భుతంగా ఆలపించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ పాట.. థియేటర్లలో పండగ వాతావరణాన్ని సృష్టిస్తుంది అనడంలో సందేహం లేదు.

జయకృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం'

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు, జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా గ్రాండ్‌గా లాంచ్ అవుతున్నారు. RX 100, మంగళవారం వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల విజనరీ ఫిల్మ్ మేకర్ అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ వెండితెర అరంగేట్రం చేయబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. టైమ్‌లెస్ కల్ట్ ప్రేమకథగా ఉండబోతే ఈ సినిమా టైటిల్‌ను అద్భుతమైన ప్రీలుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఆవిష్కరించారు. ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. పోస్టర్ లో హీరో చేతులు, అతని లవర్ చేతులు ఒక రస్టిక్ గన్ పట్టుకుని పట్టుకుని ఉండటం ఆసక్తికరంగా వుంది. ఈ పోస్టర్ సినిమాలో రోమాన్స్, హై స్టేక్ యాక్షన్ ని సూచిస్తుంది. బ్యాక్ డ్రాప్ లో పవిత్రమైన తిరుమల ఆలయం ,ప్రశాంతమైన శేషాచలం కొండలు సినిమా డెప్త్ ని ప్రజెంట్ చేస్తున్నాయి. రెండు జీవితాలు ఒక ప్రయాణం. రెండు చేతులు ఒక ప్రామిస్. రెండు మనసులు ఒక విధి. ప్రీలుక్ ఇంపాక్ట్ ఫుల్ గా వుంది. యకృష్ణ తన పాత్ర కోసం ఇంటెన్స్ గా సిద్ధమవుతున్నారు, ప్రస్తుతం ఈ చిత్రం కోసం షూటింగ్ చేస్తున్నారు. బాలీవుడ్ నటి రాషా తడాని అతనికి జోడిగా కనిపించనున్నారు. ఈ సినిమాలో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుంది.సూపర్ స్టార్ కృష్ణతో కల్ట్ బ్లాక్ బస్టర్ అగ్ని పర్వతం చిత్రాన్ని నిర్మించి, తరువాత రాజకుమారుడుతో ప్రిన్స్ మహేష్ బాబును తెలుగు సినిమాకు పరిచయం చేసిన అశ్విని దత్, ఇప్పుడు మూడవ తరం స్టార్ జయ కృష్ణ ఘట్టమనేనిని పరిచయం చేస్తూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.ఈ చిత్రానికి స్టార్ కంపోజర్ జీ.వి. ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు. వరుస బ్లాక్‌బస్టర్ ఆల్బమ్‌లను అందించిన ఆయన సంగీతం ఈ సినిమాకు మెయిన్ హైలెట్ కానుంది. సహాయ నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

'ది రైజ్ ఆఫ్ అశోక'

'వినరా మాదేవ' పాట విడుదల

'లూసియా' ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, నిర్మాతగా భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. ఈ మూవీని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాకు వినోద్ వి ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సతీష్ నినాసంకి జోడిగా 'కాంతార', 'తమ్ముడు' ఫేమ్ సప్తమి గౌడ నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'ది రైజ్ ఆఫ్ అశోక' నుంచి 'వినరా మాదేవ' అంటూ సాగే జాతర పాటను రిలీజ్ చేశారు. ఈ పాటలోని సాహిత్యం వింటే శివుడి గొప్పదనం మరోసారి అందరికీ అర్థమవుతుంది. ఆ ఊరి ప్రజలు శివుడ్ని ఎంతగా ఆరాధిస్తారు? ఎలా పూజిస్తారు? అనేది ఈ పాటలో, అందులోని సాహిత్యంలో చక్కగా చూపించారు. ఊరంతా కలిసి జరుపుకునే జాతర నేపథ్యంలో వచ్చే ఈ పాటలో విజువల్స్ అదిరిపోయాయి. ఈ పాటకు శ్రీనివాస్ కాళే అందించిన సాహిత్యం ఒకెత్తు అయితే.. సంతు మాస్టర్ కొరియోగ్రఫీ మరో ఎత్తు. 'వినరా మాదేవ' అనే పాటను సతీష్ నినాసం, సాధ్విని కొప్ప, సిద్ధు కలిసి సంయుక్తంగా ఆలపించారు. ఈ పాటలో సప్తమి గౌడ లుక్స్, అప్పియరెన్స్, స్టెప్పులు కూడా హైలెట్ కానున్నాయి. ఇక ఈ పాటను వింటే మాత్రం గూస్ బంప్స్ పక్కా అనేలా విజువల్స్, గ్రాండియర్ సెట్స్ కనిపిస్తున్నాయి. లహరి మ్యూజిక్ ద్వారా ఆడియో మార్కెట్లోకి విడుదలైంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన అన్ని పనుల్ని పూర్తి చేసుకుని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మోగ్లీ 2025.. వనవాసం సాంగ్ రిలీజ్

బబుల్గమ్ తో సక్సెస్ ఫుల్ డెబ్యు చేసిన యంగ్ హీరో రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025'తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్, టీజర్‌ను అద్భుతమైన స్పందన వచ్చింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ రోజు, మేకర్స్ సెకండ్ సింగిల్ వనవాసం రిలీజ్ చేశారు. కాల భైరవ స్వరపరిచిన ఈ పాటలో భావోద్వేగం పురాణ చిహ్నాలతో ఇంటెన్స్ గా కనిపిస్తుంది. రామాయణంలో పవిత్రమైన ప్రదేశంగా నిలిచిన అడవి మోగ్లీ జర్నీకి నేపథ్యంగా నిలిచింది. యుద్ధాన్ని తలపించేలా కాల భైరవ కంపోజిషన్ పవర్ ఫుల్ గా వుంది. కళ్యాణ్ చక్రవర్తి లిరిక్స్ ఇతిహాస వైభవాన్ని, ఆధునిక ప్రేమసంఘర్షణ కథను అద్భుతంగా మేళవిస్తూ కవితాత్మకంగా రాశారు. శ్రీరాముడు సీతమ్మవారిని రక్షించేందుకు యుద్ధానికి వెళ్లినట్లే... హీరో కూడా తన ప్రేమను కాపాడేందుకు సిద్ధం అవుతున్నాడనే భావనను భావోద్వేగంతో చిత్రించారు. కాల భైరవ, సోనీ కోమందూరి వోకల్స్ ఫైర్ ని జోడించినట్లుగా, ప్రతి బీట్‌లోని డ్రామా మరింత ఎత్తుకు చేరుతుంది. రోషన్ కనకాల పాత్రలో తెగువ, దృఢసంకల్పం అద్భుతంగా కనిపిస్తున్నాయి. రోషన్, సాక్షి మడోల్కర్ కెమిస్ట్రీ అందంగా కనిపిస్తుంది. బండి సరోజ్ కుమార్ పవర్ ఫుల్ విలన్ గా కనిపించగా, వైవా హర్ష హీరో మిత్రుడిగా వినోదాన్ని పంచుతున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200